**విలేకరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో ప్రజా ఆదరణ పొందుతున్న ప్రజా ముద్ర న్యూస్ ఛానల్ మరియు పత్రిక నందు పనిచేయుటకు అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు మరియు మండలాలు వారీగా రిపోర్టర్స్ (విలేకర్లు) కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి

95738 00809



ప్రజా ముద్ర

తెలుగు డిజిటల్ దినపత్రిక

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం !

PRAJA MUDRA NEWS

Follow /

సంపుటి: 01 సంచిక: 329 సంపాదకులు కె. నరేష్ కుమార్ 05 బుధవారం ఆగస్టు 2026 పేజీలు: 8 వెల: రూ. 3/-

Published from , Nizamabad, Hyderabad, Rangareddy, Warangal, Medak, Mahabub Nagar, Mahabubabad, Khammam, Karimnagar, Nalgonda, Adilabad


# పారదర్శకతతో పోలీస్ రిక్రూట్‌మెంట్

## నిబంధనలు పాటించాల్సిందే: సీఎం రేవంత్ రెడ్డి



7,437 పోస్టుల భర్తీపై నిఘా వర్గాల హెచ్చరిక

ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సీఎం రేవంత్ అత్యవసర భేటీ

దళారులు, కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘాకు ఆదేశం

ఉద్యోగాల పేరుతో మోసం చేస్తే కఠిన చర్యలు..

సోషల్ మీడియా దుష్ప్రచారాలకు చెక్..

ప్రశ్నపత్రాల ముద్రణ నుంచి కేంద్రాల వరకు కట్టుదిట్టమైన జాగ్రత్తలు

రిక్రూట్‌మెంట్‌ను భంగపరచే శక్తులపై నిఘా విభాగం పగడ్బందీ పర్యవేక్షణ

పరీక్షలు పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగాల నిరంతర అలర్ట్

హైదరాబాద్ ఆగస్టు 04:రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను ఎక్కడా ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా, అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్న 7,437 పోస్టుల ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. ఈ నియామక ప్రక్రియను అడ్డుకునేందుకు లేదా భంగం కలిగించేందుకు కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా నివేదికలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు ప్రభుత్వ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. నియామక ప్రక్రియ మొత్తాన్ని సంపూర్ణ పారదర్శకతతో పూర్తి చేయాలని ఈ సందర్భంగా స్పష్టమైన

మిగతా 2లో




# అవినీతిపై 'బ్రిక్స్' ఉమ్మడి సమరం

హైదరాబాద్‌లో రెండవ ఏసీడబ్ల్యూజీ భేటీ

ఆర్థిక నేరస్థుల పట్టివేత, అక్రమ ఆస్తుల రికవరీకి బ్రిక్స్ దేశాల ప్రణాళిక

సరిహద్దు దాటే అక్రమ నిధులకు చెక్..

బ్రిక్స్ సభ్య దేశాల కీలక నిర్ణయం

పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల అప్పగింత, ఆస్తుల రికవరీపై దృష్టి

సుస్థిర, సమ్మిళిత అభివృద్ధికి అవినీతే అతిపెద్ద ఆటంకం: కేంద్ర కార్యదర్శి రచనా షా

హైదరాబాద్ ఆగస్టు 04: బ్రిక్స్ దేశాల రెండో అవినీతి నిరోధక కార్యాచరణ బృందం సమావేశం మంగళవారం నగరంలో ఘనంగా ప్రారంభమైంది. ఆగస్టు 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో భాగంలోనే.. అక్రమ ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ప్రజాధనం దారి మళ్లింపుపై ఆందోళన

అవినీతి అనేది సుస్థిర, సమ్మిళిత అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారిందని రచనా షా స్పష్టం చేశారు. "ఆస్పత్రులు, పాఠశాలలు, మౌలిక వసతుల కల్పన కోసం వినియోగించాల్సిన ప్రజాధనాన్ని అవినీతి పరులు దారి మళ్లిస్తున్నారు. ఇది ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. ప్రపంచంలో ఏ దేశమూ అవినీతికి మినహాయింపు కాదు, అలాగే ఏ ఒక్క దేశమూ దీనిని ఒంటరిగా ఎదుర్కోలేదు" అని ఆమె అన్నారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థులను సత్వరమే గుర్తించి, వారి అప్పగింత

మిగతా 2లో

# రాజీనామా చేసేముందు మాట్లాడతాం

అసంతృప్తులతో చర్చలకు సిద్ధం

నేనూ ఓపికగా వేచి చూశాను

సిద్ధరామయ్య, ధరమ్ సింగ్ కేబినెట్లను గుర్తుచేసిన డీకే

పదవులు రాకపోతే తొందరపాటు వద్దు

ఎమ్మెల్యేలకు సీఎం ఓపిక పాఠాలు

2



కర్నాటక మంత్రివర్గ విస్తరణ తదనంతరం కాంగ్రెస్ పార్టీలో వ్యక్తమవుతున్న అసంతృప్తిపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. పదవులు దక్కక అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలకు ఆయన గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఎవరైనా రాజీనామా చేయాలని భావిస్తే వారి రాజీనామా లేఖలను క్షణాల్లో ఆమోదిస్తామని స్పష్టం చేశారు.



# దేశవ్యాప్తంగా ఈ20 నిషేధించాలి

పంజాబ్ అసెంబ్లీ ఏకగ్రీవ నిర్ణయం

వినియోగదారుడికి ఛాయిస్ ఇవ్వండి

ఇథనాల్ ఫ్రీ పెట్రోల్ కూడా అమ్మాలి!

మైలేజ తగ్గుతోంది..

పెట్రోల్ రిటైల్ ధరను గణనీయంగా తగ్గించాలి

సీఎం భగత్ మాన్

2

# మధ్యాహ్న భోజనంలోకి చేపలు..!

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట: మంత్రి వాకిటి శ్రీహరి

కోహెడ మార్కెట్ అందుబాటులోకి వస్తే ఆన్‌లైన్‌లో విక్రయాలు

మత్స్యకార సంఘాల ప్రతినిధులతో మంత్రి సమీక్ష

రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలు అమలు చేస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన, సహకార సంఘాల బలోపేతం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.



2



# ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

వెంకటాపూర్‌లో రూ.2.30 కోట్లతో నిర్మించిన కేజీబీవీ నూతన భవనాలు ప్రారంభం

నాణ్యమైన విద్యనందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు పిలుపు

2

# 30 ఏళ్ల బీజేపీ రికార్డుకు గండి

19,324 ఓట్ల మెజార్టీతో బోణీ కొట్టిన పీకే

స్థానిక సమస్యల వల్ల కాదు.. సీఎం వైఖరి వల్లే బీజేపీ ఓటమి

సిద్ధాంతాన్ని కాదు.. ప్రస్తుత నాయకత్వాన్ని తిరస్కరించిన ఓటర్లు

2



# వరంగల్‌లో రెండో అతిపెద్ద ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి

ఏడాది చివరికల్లా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి

మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఉమ్మడి వరంగల్, ఉత్తర తెలంగాణకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

2





# ఆస్ట్రేలియా హీరో 'రహ్మత్ పాషా'ను అభినందించిన కేటీఆర్

2

బోండీ ఘటనలో 20 మంది ప్రాణాలను కాపాడిన హైదరాబాద్ యువకుడు

ఆస్ట్రేలియా పిఆర్ సాధించడం ప్రతి తెలుగువాడికి గర్వకారణం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## వరంగల్‌లో రెండో అతిపెద్ద ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి

హైదరాబాద్ (సచివాలయం):రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రిని వరంగల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు వరంగల్ ప్రాంతీయ క్యాన్సర్ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. అలాగే, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఈ ఏడాది చివరికల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

మంగళవారం సచివాలయంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని ప్రభుత్వ వైద్య సేవలపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు, జనరల్ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , ఏరియా ఆస్పత్రుల్లో అందుతున్న సేవలు, మౌలిక వసతులు మరియు అభివృద్ధి పనుల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. స్థానిక ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**ఎంజీఎమ్‌లో మరో 9 సూపర్ స్పెషాలిటీ సేవలు**

ఎంజీఎం ఆస్పత్రిలో ప్రస్తుతం 29 ప్రత్యేక విభాగాల్లో వైద్య సేవలు అందుతున్నాయని, త్వరలోనే మరో తొమ్మిది సూపర్ స్పెషాలిటీ విభాగాలను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. నిమ్స్ తరహాలోనే వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి 'ఎల్ఓసీ' సదుపాయం కల్పిస్తామన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, సిబ్బందిని నియమించి పూర్తిస్థాయి సేవలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. దీనివల్ల నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి హైదరాబాద్ ప్రధాన ఆస్పత్రులపై రోగుల ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు.

**హనుమకొండలో ఐవీఎఫ్ కేంద్రం..**
**త్వరలోనే డయాలసిస్ సేవలు**

హనుమకొండలో ఐవీఎఫ్ కంద్రంతో పాటు ఔషధ, ఆహార పరీక్షల ప్రయోగశాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే ప్రాంతీయ నేత్ర ఆస్పత్రిలో అత్యాధునిక కంటి వైద్య సేవలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పరకాల, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, బచ్చన్నపేట, పాలకుర్తి, కమలాపూర్ ప్రాంతాలకు మంజూరైన డయాలసిస్ కేంద్రాలను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## రేపల్లెలో టీడీపీకి బిగ్ షాక్..

తాడేపల్లి ఆగస్టు 04:గుంటూరు జిల్లా రేపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి భారీ వికెట్ పడింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రధాన అనుచరుడు, ప్రముఖ కాపు సామాజికవర్గ నాయకుడు గూడపాటి శ్రీనివాసరావు (జీఎస్) తన వందలాది మంది మద్దతుదారులతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో, వైయస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గూడపాటి శ్రీనివాసరావుకు శ్రీ వైయస్ జగన్ స్వయంగా పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**జీఎస్ అన్నను గుండెల్లో పెట్టుకుంటాం: వైయస్ జగన్**

ఈ సందర్భంగా మాజీ సీఎం వైయస్ జగన్ మాట్లాడుతూ.. "జీఎస్ అన్నతో పాటు వైయస్సార్‌సీపీ కుటుంబంలోకి చేరుతున్న సహచరులందరికీ హృదయపూర్వక స్వాగతం. జీఎస్ అన్నను గుండెల్లో పెట్టుకుంటాం. ఆయన పార్టీకి, నియోజకవర్గానికి అన్ని విధాలా మంచి చేస్తారనే నమ్మకం ఉంది. రేపల్లె నియోజకవర్గ ఇంఛార్జ్ పీటా నాగమోహనకృష్ణను ఒక తమ్ముడిలా భావించి, రాబోయే ఎన్నికల్లో వైయస్సార్‌సీపీని గెలిపించే దిశగా మీరంతా కలసికట్టుగా అడుగులు వేయాలి. జీఎస్ అన్న రాకతో రేపల్లె నియోజకవర్గంలో, ముఖ్యంగా పట్టణ ప్రాంతంలో పార్టీ మరింతగా బలపడుతుంది" అని ధీమా వ్యక్తం చేశారు.

ఈ చేరికల కార్యక్రమంలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని వెంకట్రామయ్య (నాని), మేరుగు నాగార్జున, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ నందిగం సురేష్, రేపల్లె నియోజకవర్గ పార్టీ ఇంఛార్జ్ పీటా నాగమోహనకృష్ణ, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిలతో పాటు పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలోకి చేపలు..!

హైదరాబాద్ ఆగస్టు 04: రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలు అమలు చేస్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన, సహకార సంఘాల బలోపేతం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

**విద్యార్థులకు పౌష్టికాహారం.. ఉచిత చేప పిల్లల పంపిణీ**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు మోపెడ్‌లు, రిటైల్ అవుట్‌లెట్లు, ఇన్సూరెన్స్ వంటి మౌలిక వసతుల కల్పనకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించడంతో పాటు పెండింగ్ బకాయిల విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా, విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించే ఉద్దేశంతో పాఠశాలల మధ్యాహ్న భోజన పథకంలో చేపలను చేర్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు.

**ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు.. ప్రతి మూడు నెలలకోసారి సమీక్ష**

మత్స్యకారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఇకపై ప్రతి మూడు నెలలకోసారి జిల్లా అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి శ్రీహరి తెలిపారు. హైదరాబాద్ కోహెడలో శరవేగంగా నిర్మాణమవుతున్న సమీకృత చేపల మార్కెట్ పూర్తయిన వెంటనే, ఆన్‌లైన్ ద్వారా చేపల విక్రయాలు, పంపిణీకి శ్రీకారం చుడతామన్నారు.

గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న సొసైటీల సభ్యత్వ వివాదాలను సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు. ఇప్పటికే మత్స్యకారులకు సంబంధించి రూ.1.34 కోట్ల బీమా క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు గుర్తుచేశారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులకు ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ కల్పించే అంశంపై ప్రభుత్వంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# ఆస్ట్రేలియా హీరో 'రహ్మత్ పాషా'ను అభినందించిన కేటీఆర్



హైదరాబాద్ ఆగస్టు 04:ఆస్ట్రేలియాలోని బోండీ ప్రాంతంలో జరిగిన ఘోర దాడి ఘటనలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి, పలువురి ప్రాణాలను కాపాడిన హైదరాబాద్‌కు చెందిన రహ్మత్ పాషాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా అభినందించారు. ప్రాణాలకు తెగించి దాదాపు 20 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన రహ్మత్ పాషా ధైర్యం, మానవత్వం అసాధారణమైనవని కేటీఆర్ కొనియాడారు. ఆయన సేవలను గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం శాశ్వత నివాస హోదా (గ్రా=) కల్పించడం ప్రతి భారతీయుడికి, ముఖ్యంగా తెలుగు సమాజానికి తీవ్ర గర్వకారణమని పేర్కొన్నారు.

ప్రాణాలకు తెగించి ఆపద్బాంధవుడిగా..

బోండీ బీచ్ సమీపంలో ఒక ప్రయాణికుడిని దింపిన సమయంలో పెద్ద శబ్దాలు వినిపించడంతో, వెంటనే అప్రమత్తమైన రహ్మత్ పాషా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దుండగుడు దాడి చేస్తున్నట్లు గుర్తించినప్పటికీ, భయపడి పారిపోకుండా అక్కడ తీవ్రంగా గాయపడిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొన్నారు. సమాజం కోసం నిస్వార్థంగా సేవ చేయాలనే గొప్ప భావనను ఆయన తన కార్యాచరణతో నిరూపించారని కేటీఆర్ ప్రశంసించారు.

ఆస్ట్రేలియా బ్రేవరీ అవార్డుకు నామినేట్

రహ్మత్ పాషా చూపిన సాహసానికి గాను ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆయనకు 'పిఆర్' మంజూరు చేయడంతో పాటు ప్రతిష్ఠాత్మక 'బ్రేవరీ అవార్డు'కు కూడా నామినేట్ చేసింది. అంతేకాకుండా ఆయన పనిచేస్తున్న రైడ్ షేరింగ్ సంస్థ కూడా ఆయనను ప్రత్యేకంగా గౌరవించింది. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి ఖ్యాతిని పెంచిన రహ్మత్ పాషా నేటి యువతకు ఆదర్శమని కేటీఆర్ అన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, నిశీధర్ బొర్రా, వేణు తదితరులు పాల్గొని రహ్మత్ పాషాను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

## పారదర్శకతతో పోలీస్ రిక్రూట్‌మెంట్

మార్గదర్శకాలు జారీ చేశారు.

పేపర్ ప్రింటింగ్ నుంచి పరీక్ష కేంద్రాల వరకు కట్టుదిట్టమైన భద్రత

ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు ప్రతి దశలోనూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. నియామకాలపై సోషల్ మీడియాలో జరిగే దుష్ప్రచారాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, వ్యాజ్యాన్ని సృష్టించే సోషల్ మీడియా ఖాతాలపై సైబర్ క్రైమ్ విభాగం నిరంతరం కన్నేసి ఉంచాలని తెలిపారు. పరీక్షల ప్రక్రియ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగాలు అలర్ట్‌గా ఉండాలని స్పష్టం చేశారు.ఈ అత్యవసర సమీక్షా సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాసరావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీనామా చేసేముందు మాట్లాడతాం

బెంగళూరు ఆగస్టు 04:కర్నాటక మంత్రివర్గ విస్తరణ తదనంతరం కాంగ్రెస్ పార్టీలో వ్యక్తమవుతున్న అసంతృప్తిపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. పదవులు దక్కక అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలకు ఆయన గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఎవరైనా రాజీనామా చేయాలని భావిస్తే వారి రాజీనామా లేఖలను క్షణాల్లో ఆమోదిస్తామని స్పష్టం చేశారు.

**రాజీనామాకు ముందు మాట్లాడతాం**

సోమవారం మొత్తం 20 మంది ఎమ్మెల్యేలు నూతన మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పూర్తి స్థాయి కేబినెట్ విస్తరణ పూర్తయినప్పటికీ, మంత్రి పదవులు దక్కని కొందరు నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామాకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో డీకే శివకుమార్ స్పందించారు. "ఎవరైనా రాజీనామా చేస్తే వెంటనే ఆమోదిస్తాం. అయితే, అంతకంటే ముందు వారితో వ్యక్తిగతంగా మాట్లాడి పరిస్థితిని వివరిస్తాం" అని పేర్కొన్నారు.

**నా రాజకీయ జీవితమే ఒక ఉదాహరణ**

పదవులు రాలేదని తొందరపడవద్దని, కొంత ఓపిక పట్టాలని అసంతృప్త ఎమ్మెల్యేలకు డీకే సూచించారు. "గతంలో ధరమ్ సింగ్, సిద్ధరామయ్య మరియు పరమేశ్వర పాలనా కాలంలో నాకు వెంటనే అవకాశాలు రాకపోయినా ఎంతో సంయమనంతో వేచి చూశాను. నాయకులు ఓపికతో ఉంటే కాలమే తగిన గుర్తింపు ఇస్తుంది" అని తన సొంత రాజకీయ అనుభవాన్ని గుర్తు చేశారు.

**మొదటి రోజే కరువు ప్రాంతాలకు మంత్రులు**

నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులందరూ మంగళవారం నుంచే తక్షణమే కరువు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని ఆదేశించినట్లు డీకే శివకుమార్ తెలిపారు. పాలనపై, ప్రజారోగ్య-కరువు సమస్యలపైనే ప్రభుత్వం దృష్టి సారిస్తుందని, మంత్రులందరూ క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

## దేశవ్యాప్తంగా ఈ20 నిషేధించాలి

చండీగఢ్ ఆగస్టు 04: దేశవ్యాప్తంగా విక్రయిస్తున్న 20 శాతం ఇథనాల్ కలిపిన 'ఈ20 పెట్రోల్' వాడకాన్ని తక్షణమే నిషేధించాలని కోరుతూ పంజాబ్ శాసనసభ మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానం పాస్ చేసింది. ఈ20 ఇంధనం వల్ల వాహనాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, మైలేజీ పడిపోతోందని వినియోగదారుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అసెంబ్లీ ఈ నిర్ణయం తీసుకుంది.

**వినియోగదారులకు ఎంపిక ఇవ్వాలి**

20 శాతం ఇథనాల్ పెట్రోల్ అమ్మకాలను పంజాబ్ అసెంబ్లీ తీవ్రంగా వ్యతిరేకించింది. మార్కెట్‌లో సాధారణ (ఇథనాల్ లేని) పెట్రోల్‌తో పాటు ఈ20 పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచి, తమకు నచ్చిన ఇంధనాన్ని ఎంచుకునే సదుపాయాన్ని వినియోగదారులకు ఇవ్వాలని తీర్మానంలో డిమాండ్ చేశారు. ఈ20 కి తగినట్లు ఇంజన్ డిజైన్ లేని పాత వాహనాల్లో ఈ పెట్రోల్ వాడటం వల్ల సాంకేతిక సమస్యలు తలెత్తి వాహనాలు పాడవుతున్నాయని స్పష్టం చేసింది.

**ధర తగ్గించాలి.. నిపుణుల కమిటీ వేయాలి**

ఈ20 పెట్రోల్ వల్ల వాహనాల్లో మైలేజీ తగ్గుతున్నందున, దానికి అనుగుణంగా రిటైల్ మార్కెట్‌లో పెట్రోల్ ధరను తగ్గించాలని సభ కోరింది. ఆటోమొబైల్ ఇంజినీర్లు, పెట్రోలియం నిపుణులు, పర్యావరణ వేత్తలు, వినియోగదారుల సంఘాలు మరియు రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో ఒక స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, ఇథనాల్ బ్లెండెడ్ ఇంధనంపై సమగ్ర అధ్యయనం జరిపించాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది.

**అమెరికా ఒత్తిడి వల్లే నిర్ణయం: సీఎం భగవంత్ మాన్**

అసెంబ్లీలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "సుమారు 45,000 వాహనాలపై ఈ20 పెట్రోల్ ప్రభావం గురించి జరిపిన అధ్యయనంలో మైలేజీ బాగా తగ్గడంతో పాటు పలు వాహనాల ఇంజన్లు పాడైనట్లు తేలింది. కేంద్ర ప్రభుత్వం కేవలం అమెరికా ప్రభుత్వ ఒత్తిడి వల్లే ఈ20 అమ్మకాలపై పట్టుబడుతోంది" అని ఆరోపించారు. ఇటీవల అమెరికాతో కుదిరిన 100 బిలియన్ డాలర్ల వాణిజ్య ఒప్పందంలో భాగంగా భారత్ 5 బిలియన్ లీటర్ల ఇథనాల్‌ను కొనుగోలు చేయాల్సి రావడం వల్లే కేంద్రం పౌరులపై ఈ భారాన్ని మోపుతోందని భగవంత్ మాన్ వ్యాఖ్యానించారు.

## అవినీతిపై 'బ్రిక్స్' ఉమ్మడి సమరం..

ప్రక్రియను వేగవంతం చేయాలని, సరిహద్దులు దాటి జరిగే అక్రమ నిధుల తరలింపును అరికట్టేందుకు బ్రిక్స్ దేశాలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**డిజిటల్ పాలనతోనే అవినీతికి చెక్**

సమాచార మార్పిడికి అనువైన ప్రామాణిక విధానాలు, అధికారుల డైరెక్టరీ ద్వారా సభ్య దేశాల న్యాయ అమలు సంస్థల మధ్య వేగవంతమైన సహకారం సాధ్యమవుతుందని రచనా షా ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక ఆధారిత పారదర్శక పాలన అవినీతిని నిరోధించడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. డిజిటల్ గుర్తింపు వ్యవస్థలు, ప్రత్యక్ష నగదు బదిలీ (ఐడీ), ఆన్‌లైన్ సేవలు, కాగితరహిత పన్ను విధానం వంటి సంస్కరణలు అవినీతికి ఉన్న అవకాశాలను గణనీయంగా తగ్గిస్తున్నాయని వివరించారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో అక్రమ ఆస్తుల రాబట్టుకోవడంతో పాటు ఆర్థిక సాంకేతికత, వర్చువల్ డిజిటల్ ఆస్తుల (క్రిప్టో వంటివి) దుర్వినియోగం, సాంకేతిక ఆధారిత నైతిక పాలనపై విస్తృతంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు, విధాన రూపకర్తలు, వివిధ దేశాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**ములుగు (వెంకటాపూర్) ఆగస్టు 04:**విద్యార్థులు ఇష్టంతో, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, నేటి పోటీ ప్రపంచంలో తమ ప్రతిభను చాటాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. మంగళవారం వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలో సమగ్ర శిక్ష పథకం కింద రూ.2.30 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవనం, అదనపు తరగతి గదులు, ప్రయోగశాల (లాబ్) భవనాలను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు.

కంప్యూటర్ విద్య, క్రమశిక్షణ అవసరం

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ, నేటి యుగంలో ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్యపై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. గొప్ప విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని, చదువుతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, ధ్యానం కూడా జీవితంలో ముఖ్యమైన భాగాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చాటుతున్నారని, విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆకాంక్షించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రైవేటుకు తీసిపోని విధంగా నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు మంత్రి సూచించారు. ఆధునిక బోధనా పద్ధతులను అవలంబిస్తూ రానున్న పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, పాఠశాలల్లో విద్యాబోధన, మధ్యాహ్న భోజన నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను సైతం నియమించినట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

రామప్ప ఆలయం వద్ద 'ప్రసాద్' పనుల పరిశీలన

అనంతరం, పాలంపేటలోని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామప్ప ఆలయం వద్ద 'ప్రసాద్' పథకం కింద రూ.61.99 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి సీతక్క పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించిన ఆమె, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## 30 ఏళ్ల బీజేపీ రికార్డుకు గండి

పట్నా:బంకీపుర్ అసెంబ్లీ ఉపఎన్నిక ఫలితం కేవలం ఒక నియోజకవర్గ తీర్పు మాత్రమే కాదని, అది బిహార్‌లోని ఎన్‌డీఏ ప్రభుత్వ నాయకత్వంపై ప్రజలు ఇచ్చిన స్పష్టమైన సందేశమని జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, నూతన ఎమ్మెల్యే ప్రశాంత్ కిశోర్ అభిప్రాయపడ్డారు. ఉపఎన్నికలో సంచలన విజయం సాధించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం సమ్రాట్ చౌధరీ వైఖరి, వ్యక్తిత్వం మరియు నాయకత్వ శైలిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

**బీజేపీ ఓటమికి సీఎమే కారణం**

గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే బంకీపుర్ స్థానంలో బీజేపీకి 51 వేలకు పైగా మెజార్టీ వచ్చిందని పీకే గుర్తుచేశారు. ఈ కొద్ది నెలల వ్యవధిలో నియోజకవర్గంలో కొత్తగా రోడ్లు దెబ్బతినడమో లేదా స్థానిక సమస్యలు తలెత్తడమో జరగలేదని, అయినప్పటికీ ఓటర్లు బీజేపీని ఓడించారంటే అది కేవలం రాష్ట్రంలో తీసుకొచ్చిన కొత్త నాయకత్వం వల్లేనని ఆరోపించారు. ప్రజలు బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించడం లేదని, ప్రస్తుతం రాష్ట్రాన్ని నడిపిస్తున్న వ్యక్తి విధానాలను, ఆయన ప్రవర్తనను పూర్తిగా తిరస్కరించారని స్పష్టం చేశారు.

**కుల రాజకీయాలు పక్కనపెట్టి ఉపాధిపై దృష్టి పెట్టాలి**

బిహార్‌లో ప్రస్తుతం నేరాలు, ఎన్‌కౌంటర్లు, కుల రాజకీయాల చుట్టూనే చర్చలు సాగుతుండటం విచారకరమని ప్రశాంత్ కిశోర్ అన్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రజలకు సంబంధించిన విద్య, ఉపాధి మరియు యువత వలసల నివారణ వంటి కీలక అంశాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

"ఎన్‌డీఏ కూటమికి అసెంబ్లీలో స్పష్టమైన మెజార్టీ ఉన్నందున బిహార్‌లో ప్రభుత్వం మారే అవకాశం లేదు. కానీ, బీజేపీ కేంద్ర నాయకత్వం ఈ ఉపఎన్నిక ఫలితాన్ని తీవ్రంగా పరిగణించాలి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే స్పందించి రాష్ట్రానికి మంచి వ్యక్తిత్వం, అర్హత కలిగిన నాయకుడిని ముఖ్యమంత్రిగా నియమించాలి" అని సూచించారు.

**తొలి ఎన్నికల విజయం -- ఆర్జేడీపై కామెంట్స్**

ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ భవిష్యత్తుపై స్పందిస్తూ.. వచ్చే నాలుగేళ్లలో ప్రతిపక్ష నాయకుడిగా ఆయన పాత్రను ఎంత సమర్థంగా పోషిస్తారనే దానిపైనే ఆయన రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు.కాగా, 1995 నుంచి బీజేపీ ఆధిపత్యంలో ఉంటూ, సీనియర్ నేత నితిన్ నబీన్ రాజీనామాతో ఖాళీ అయిన బంకీపుర్ నియోజకవర్గంలో ప్రశాంత్ కిశోర్ తన తొలి ఎన్నికల పోరులోనే 19,324 ఓట్ల భారీ మెజార్టీతో చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకున్నారు.

## పరిశుభ్రతకు తొలి అడుగు.. అంతర్వస్త్రాల ప్రాధాన్యం

**వ్యక్తిగత ఆరోగ్యానికి రోజువారీ శుభ్రత అవసరం**

**నాణ్యమైన వస్త్రాల వినియోగంపై అవగాహన**

**వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి గుర్తింపు దినం**

**సరైన అలవాట్లతో ఆరోగ్యవంతమైన జీవనం**



డెస్క్, ఆగస్టు 4 : ప్రతి ఏడాది ఆగస్టు 5న జాతీయ అండర్‌వేర్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. వ్యక్తిగత పరిశుభ్రతలో అంతర్వస్త్రాల ప్రాధాన్యాన్ని గుర్తు చేయడం, నాణ్యమైన వస్త్రాల వినియోగంపై అవగాహన కల్పించడం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధిని ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. శరీరానికి నేరుగా తగిలే దుస్తుల్లో అంతర్వస్త్రాలు అత్యంత ముఖ్యమైనవి. వాటిని సరైన విధంగా ఉపయోగించడం, ప్రతిరోజూ మార్చడం, పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మనిషి దైనందిన జీవితంలో అంతర్వస్త్రాలు కీలకమైన పాత్ర పోషిస్తాయి. శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బాహ్య దుస్తులను చెమట, తేమ, మురికి నుంచి రక్షిస్తాయి. రోజంతా సౌకర్యంగా ఉండేందుకు, శరీరానికి అవసరమైన మద్దతు అందించేందుకు ఇవి ఉపయోగపడతాయి. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా సరైన నాణ్యత కలిగిన అంతర్వస్త్రాలను ధరించడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉండటంతో పాటు అసౌకర్యం కూడా తగ్గుతుంది.

వ్యక్తిగత పరిశుభ్రతలో అంతర్వస్త్రాల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఒకే అంతర్వస్త్రాన్ని వరుసగా ఉపయోగించడం, తడిగా ఉన్న దుస్తులను ధరించడం, సరిగా ఉతకకుండా మళ్లీ వినియోగించడం వంటి అలవాట్లు చర్మ సంబంధిత సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది. అందుకే ప్రతిరోజూ శుభ్రమైన అంతర్వస్త్రాలను ధరించడం, ఉతికిన తర్వాత పూర్తిగా ఆరబెట్టడం, వ్యక్తిగతంగా మాత్రమే ఉపయోగించడం వంటి అలవాట్లు ప్రతి ఒక్కరూ పాటించాలి. వైద్యుల అభిప్రాయం ప్రకారం పత్తితో తయారైన అంతర్వస్త్రాలు ఎక్కువ సందర్భాల్లో అనుకూలంగా ఉంటాయి. ఇవి గాలి ప్రసరణకు సహాయపడటంతో పాటు చెమటను సులభంగా గ్రహిస్తాయి. శరీరానికి మరీ బిగుతుగా ఉండే అంతర్వస్త్రాలు అసౌకర్యంతో పాటు కొన్ని ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంది. అందువల్ల శరీరానికి సరిపోయే పరిమాణంలో, నాణ్యమైన వస్త్రంతో తయారైన అంతర్వస్త్రాలను ఎంపిక చేసుకోవడం అవసరం.

అంతర్వస్త్రాల తయారీ ప్రపంచ వస్త్ర పరిశ్రమలో ఒక ప్రధాన విభాగంగా అభివృద్ధి చెందింది. ఆధునిక సాంకేతికతతో వివిధ వయసుల వారికి, వివిధ అవసరాలకు అనుగుణంగా అనేక రకాల ఉత్పత్తులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఈ రంగం ద్వారా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుండగా, దేశాల ఆర్థికాభివృద్ధికి కూడా ఇది తోడ్పడుతోంది. భారతదేశం కూడా ప్రపంచ వస్త్ర తయారీ రంగంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించడంతో ఈ పరిశ్రమ మరింత విస్తరిస్తోంది. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా వస్త్ర పరిశ్రమలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సేంద్రియ పత్తి, పునర్వినియోగ పదార్థాలతో తయారైన అంతర్వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోంది. రసాయనాల వినియోగాన్ని తగ్గించడం, నీటి వినియోగాన్ని ఆదా చేయడం, పర్యావరణహిత తయారీ విధానాలను ప్రోత్సహించడం వంటి చర్యలు ఈ రంగంలో వేగంగా అమలవుతున్నాయి. వినియోగదారులు కూడా పర్యావరణానికి మేలు చేసే ఉత్పత్తులను ఎంచుకునే ధోరణి పెరుగుతోంది.

ఆరోగ్యకరమైన జీవనశైలిలో పరిశుభ్రమైన దుస్తులు ఒక ముఖ్యమైన భాగం. చేతులు కడుక్కోవడం, ప్రతిరోజూ స్నానం చేయడం ఎంత అవసరమో, శుభ్రమైన అంతర్వస్త్రాలను ఉపయోగించడం కూడా అంతే అవసరం. ముఖ్యంగా పిల్లలు, యుక్తవయస్కులు, క్రీడాకారులు, ఎక్కువ సమయం బయట పనిచేసే వారు ఈ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న చిన్న పరిశుభ్రత అలవాట్లే పెద్ద ఆరోగ్య సమస్యలను నివారించగలవు. నాణ్యమైన అంతర్వస్త్రాలను కొనుగోలు చేసే సమయంలో వస్త్రం నాణ్యత, పరిమాణం, సౌకర్యం, మన్నిక వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఆకర్షణీయమైన రూపం కంటే ఆరోగ్యానికి అనుకూలమైన ఉత్పత్తులను ఎంపిక చేసుకోవడం మంచిది. అలాగే కాలానుగుణంగా పాతబడిన లేదా దెబ్బతిన్న అంతర్వస్త్రాలను మార్చడం కూడా వ్యక్తిగత పరిశుభ్రతలో భాగమే.

జాతీయ అండర్‌వేర్ దినోత్సవం కేవలం ఒక వస్త్రానికి సంబంధించిన దినోత్సవం మాత్రమే కాదు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య అవగాహన, నాణ్యమైన జీవనశైలి, వస్త్ర పరిశ్రమ ప్రాధాన్యాన్ని గుర్తు చేసే సందర్భంగా దీనిని చూడాలి. శుభ్రమైన అంతర్వస్త్రాల వినియోగాన్ని రోజువారీ అలవాటుగా మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టినప్పుడే ఈ దినోత్సవం నిజమైన సార్థకతను పొందుతుంది.

# సిగ్నల్ పాటిస్తే.. సురక్షిత ప్రయాణం

**1914లో ప్రారంభమైన ఆధునిక ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ**

**నియమాల పాటింపుతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట**

**సాంకేతికతతో మారుతున్న ట్రాఫిక్ నిర్వహణ**

**ప్రతి పౌరుడి బాధ్యతగా రహదారి క్రమశిక్షణ**



డెస్క్, ఆగస్టు 4 : ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది ఆగస్టు 5న ప్రపంచ ట్రాఫిక్ లైట్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. రహదారి భద్రతలో ట్రాఫిక్ సిగ్నళ్ల పాత్రను గుర్తు చేయడంతో పాటు ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. ఆధునిక ప్రపంచంలో రవాణా వ్యవస్థ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నా, దానిని క్రమబద్ధంగా నడిపించే మూలాధారం ట్రాఫిక్ సిగ్నళ్లే. ప్రతి రోజూ లక్షలాది వాహనాలు, కోట్లాది మంది ప్రజలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోంది. కొన్ని సెకన్ల పాటు సిగ్నల్ కోసం వేచి ఉండడం చిన్న విషయంలా అనిపించినా, అదే అనేక కుటుంబాలను ప్రమాదాల నుంచి కాపాడే అమూల్యమైన సమయంగా మారుతుంది. అందుకే ట్రాఫిక్ సిగ్నల్‌ను కేవలం ఒక లైట్‌గా కాకుండా, ప్రాణాలను రక్షించే నిశ్శబ్ద కాపలాదారుగా భావిస్తారు. ప్రపంచ ట్రాఫిక్ లైట్ దినోత్సవానికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. 1914 ఆగస్టు 5న అమెరికాలోని ఒహాయో రాష్ట్రం క్లీవ్‌ల్యాండ్ నగరంలో తొలి విద్యుత్ ఆధారిత ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేశారు. ఆ కాలంలో ఎరుపు, ఆకుపచ్చ రంగులతో మాత్రమే పనిచేసే ఈ వ్యవస్థ వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు ఉపయోగపడింది. అనంతరం పసుపు రంగు హెచ్చరిక సంకేతాన్ని కూడా చేర్చడంతో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అమలులో ఉన్న మూడు రంగుల ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ రూపుదిద్దుకుంది. కాలక్రమేణా ఈ వ్యవస్థలో ఎన్నో సాంకేతిక మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, ఎరుపు అంటే ఆగాలి, పసుపు అంటే అప్రమత్తంగా ఉండాలి, ఆకుపచ్చ అంటే ముందుకు సాగాలి అనే ప్రాథమిక సూత్రం మాత్రం యథాతథంగా కొనసాగుతోంది.

నేటి ప్రపంచంలో ట్రాఫిక్ సిగ్నళ్లు కేవలం వాహనాలను నియంత్రించే సాధనంగా మాత్రమే ఉండడం లేదు. స్మార్ట్ నగరాల అభివృద్ధిలో ఇవి కీలక భాగంగా మారాయి. వాహనాల రద్దీని గుర్తించే సెన్సార్లు, కృత్రిమ మేధస్సుతో పనిచేసే సిగ్నల్ వ్యవస్థలు, అత్యవసర సేవల వాహనాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చే సాంకేతికత, పాదచారులకు ప్రత్యేక సమయం కేటాయించే డిజిటల్ సిగ్నళ్లు వంటి ఆధునిక సదుపాయాలు ప్రపంచంలోని అనేక దేశాల్లో అందుబాటులోకి వచ్చాయి. దీంతో ట్రాఫిక్ జామ్‌లు తగ్గడంతో పాటు ఇంధన వినియోగం, వాయు కాలుష్యం కూడా తగ్గుతున్నాయి. భారత్‌లో వాహనాల సంఖ్య ఏటా లక్షల సంఖ్యలో పెరుగుతోంది. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, నగర రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి రోజురోజుకూ అధికమవుతోంది. ఈ పరిస్థితుల్లో ట్రాఫిక్ సిగ్నళ్ల ప్రాధాన్యం మరింత పెరిగింది. అయినప్పటికీ కొంతమంది వాహనదారులు ఎరుపు సిగ్నల్‌ను దాటడం, నిర్లక్ష్యంగా మలుపులు తిరగడం, ఒకదానిని మరొకటి దాటేందుకు పోటీ పడటం వంటి చర్యల వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని క్షణాల తొందర కోసం చేసే ఈ తప్పిదాలు జీవితాంతం మరిచిపోలేని విషాదాలకు కారణమవుతున్నాయి.రోడ్డు ప్రమాదాలకు కేవలం మౌలిక వసతుల లోపమే కారణం కాదు. మానవ తప్పిదాలే అధిక శాతం ప్రమాదాలకు కారణమవుతున్నాయని రహదారి భద్రత నిపుణులు చెబుతున్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ మాట్లాడటం లేదా సందేశాలు పంపడం, హెల్మెట్ లేదా సీటుబెల్ట్ ధరించకపోవడం, ట్రాఫిక్ సిగ్నళ్లను పట్టించుకోకపోవడం వంటి అలవాట్లు ప్రమాదాలను పెంచుతున్నాయి. ఈ అలవాట్లను మార్చకుండా ప్రమాదాలను పూర్తిగా నివారించడం సాధ్యం కాదని అధికారులు తరచూ హెచ్చరిస్తున్నారు. ట్రాఫిక్ క్రమశిక్షణ చిన్నప్పటి నుంచే అలవడాలి. పాఠశాలల్లో రహదారి భద్రతపై ప్రత్యేక పాఠాలు బోధించడం, ట్రాఫిక్ పార్కులు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భవిష్యత్ తరాన్ని బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దవచ్చు. చిన్నపిల్లలు నేర్చుకున్న మంచి అలవాట్లు కుటుంబ సభ్యులపై కూడా ప్రభావం చూపుతాయి. దీంతో సమాజంలో ట్రాఫిక్ నియమాల పట్ల గౌరవం పెరుగుతుంది.

ట్రాఫిక్ పోలీసుల పాత్ర కూడా ఎంతో కీలకమైనది. ఎండ, వర్షం, చలి అనే తేడా లేకుండా గంటల తరబడి కూడళ్ల వద్ద నిలబడి వాహనాలను క్రమబద్ధీకరిస్తుంటారు. ప్రజలు వారి సూచనలను పాటిస్తేనే ట్రాఫిక్ సజావుగా సాగుతుంది. సాంకేతిక పరికరాలతో పాటు మానవ పర్యవేక్షణ కూడా సమర్థవంతంగా ఉంటే రహదారి భద్రత మరింత మెరుగుపడుతుంది. ట్రాఫిక్ పోలీసులు ప్రజల శత్రువులు కాదు, వారి భద్రత కోసం పనిచేసే రక్షకులనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలి. ప్రస్తుతం అనేక నగరాల్లో సీసీ కెమెరాలు, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ గుర్తింపు వ్యవస్థలు, ఈ–చలాన్లు, కృత్రిమ మేధస్సు ఆధారిత ట్రాఫిక్ పర్యవేక్షణ వ్యవస్థలు అమలులో ఉన్నాయి. సిగ్నల్ దాటిన వెంటనే జరిమానా నమోదు కావడం, అతివేగాన్ని గుర్తించడం, నియమాలు ఉల్లంఘించిన వారికి డిజిటల్ రూపంలో సమాచారం చేరడం వంటి విధానాలు పారదర్శకతను పెంచుతున్నాయి. అయితే జరిమానాల భయంతో కాకుండా బాధ్యతతో నియమాలు పాటించే సంస్కృతి ఏర్పడినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది.

పర్యావరణ పరిరక్షణలో కూడా ట్రాఫిక్ సిగ్నళ్ల పాత్ర ఉంది. సక్రమంగా పనిచేసే సిగ్నల్ వ్యవస్థ వల్ల వాహనాలు అనవసరంగా నిలిచిపోవడం తగ్గుతుంది. దీంతో ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా కార్బన్ ఉద్గారాలు కూడా తగ్గుతాయి. సమయానికి గమ్యస్థానాలకు చేరుకోవడం వల్ల ప్రజల ఉత్పాదకత పెరుగుతుంది. స్మార్ట్ ట్రాఫిక్ నిర్వహణ నగరాల ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతోంది. ప్రపంచ ట్రాఫిక్ లైట్ దినోత్సవం మనందరికీ ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. ట్రాఫిక్ సిగ్నల్ అనేది కేవలం ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల సమాహారం కాదు. అది క్రమశిక్షణకు ప్రతీక, ప్రాణ రక్షణకు మార్గదర్శి, సామాజిక బాధ్యతకు నిదర్శనం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను గౌరవించి, సిగ్నళ్లను కచ్చితంగా పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయి. “ఒక్క క్షణం ఓపిక… జీవితాంతం భద్రత” అనే సందేశాన్ని ప్రతి పౌరుడు ఆచరణలో పెట్టినప్పుడే ప్రపంచ ట్రాఫిక్ లైట్ దినోత్సవం నిజమైన సార్థకతను పొందుతుంది.

# సముద్ర సంపదలో గుల్లల విశిష్ట స్థానం



డెస్క్, ఆగస్టు 4 : ప్రతి ఏడాది ఆగస్టు 5న జాతీయ గుల్ల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సముద్ర ఆహారంలో ప్రత్యేక స్థానం కలిగిన గుల్లల ప్రాధాన్యాన్ని గుర్తు చేయడం, వాటి పోషక విలువలపై అవగాహన పెంచడం, మత్స్య పరిశ్రమ అభివృద్ధికి వాటి పాత్రను తెలియజేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా సముద్ర ఆహార ప్రియులు ఈ రోజును ప్రత్యేకంగా జరుపుకుంటారు. గుల్లలు కేవలం రుచికరమైన ఆహార పదార్థాలే కాకుండా సముద్ర జీవావరణ సమతుల్యతను కాపాడడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. గుల్లలు సముద్రాలు, నదీముఖాలు, ఉప్పునీటి ప్రాంతాల్లో సహజసిద్ధంగా పెరిగే ద్విపుట కవచ జీవులు. గట్టి పెంకుతో ఉండే వీటి లోపల మృదువైన శరీరం ఉంటుంది. నీటిలోని సూక్ష్మ జీవులను వడకట్టి ఆహారంగా తీసుకోవడం వీటి ప్రత్యేక లక్షణం. ఈ ప్రక్రియ వల్ల నీటిలోని మలినాలు తగ్గి నీటి నాణ్యత మెరుగుపడుతుంది. అందువల్ల గుల్లలను ప్రకృతి సిద్ధమైన నీటి శుద్ధి జీవులుగా కూడా పరిగణిస్తారు.

పోషకాహార పరంగా గుల్లలకు విశేష ప్రాధాన్యం ఉంది. అధిక మోతాదులో ప్రోటీన్లు, ఒమేగా--3 కొవ్వు ఆమ్లాలు, జింక్, ఇనుము, సెలీనియం, విటమిన్ బి--12 వంటి పోషకాలు వీటిలో సమృద్ధిగా లభిస్తాయి. శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో, కండరాల అభివృద్ధిలో, మెదడు పనితీరు మెరుగుపరచడంలో ఈ పోషకాలు దోహదపడతాయి. అయితే గుల్లలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, సురక్షితంగా వండుకుని మాత్రమే తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో గుల్లల సాగు ఒక ప్రధాన పరిశ్రమగా అభివృద్ధి చెందింది. అమెరికా, జపాన్, చైనా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో లక్షలాది మంది ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో గుల్లల పెంపకం గ్రామీణ ప్రజలకు ఉపాధిని కల్పించడంతో పాటు విదేశీ మారకద్రవ్యాన్ని కూడా ఆర్జిస్తోంది. స్థిరమైన సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా ఈ రంగం మరింత అభివృద్ధి చెందుతోంది. భారత్‌లో కూడా గుల్లల సాగుకు మంచి అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, కేరళ, గుజరాత్ వంటి తీర రాష్ట్రాల్లో గుల్లల పెంపకంపై పరిశోధనలు, ప్రయోగాలు జరుగుతున్నాయి. మత్స్యశాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ, సాంకేతిక సహాయం అందిస్తూ ఈ రంగాన్ని ప్రోత్సహించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

శాస్త్రీయ పద్ధతుల్లో గుల్లల సాగు చేపడితే మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గుల్లలు ముత్యాల ఉత్పత్తిలో కూడా ప్రత్యేక గుర్తింపు పొందాయి. కొన్ని ప్రత్యేక జాతుల గుల్లలలో సహజంగా లేదా కృత్రిమంగా ముత్యాలు ఏర్పడతాయి. ఈ ముత్యాలకు ప్రపంచ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ముత్యాల సాగు ద్వారా అనేక దేశాలు గణనీయమైన ఆదాయాన్ని పొందుతున్నాయి. అందుకే గుల్లలను ఆహార వనరుగా మాత్రమే కాకుండా విలువైన ఆర్థిక వనరుగా కూడా పరిగణిస్తారు.సముద్ర జీవావరణ పరిరక్షణలో గుల్లల పాత్ర అత్యంత కీలకమైనది. ఇవి నీటిని శుద్ధి చేయడంతో పాటు ఇతర చిన్న సముద్ర జీవులకు ఆశ్రయం కల్పిస్తాయి. గుల్లలతో ఏర్పడే సహజ దిబ్బలు సముద్ర అలల తీవ్రతను తగ్గించి తీరప్రాంతాల కోతను నియంత్రించడంలో సహాయపడతాయి. జీవ వైవిధ్యాన్ని కాపాడడంలో కూడా వీటి పాత్ర ఎంతో గొప్పది. అందుకే ప్రపంచవ్యాప్తంగా గుల్లల సహజ నివాసాలను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అయితే కాలుష్యం, సముద్ర జలాల ఉష్ణోగ్రత పెరగడం, ప్లాస్టిక్ వ్యర్థాలు, అధిక మోతాదులో వేట వంటి కారణాలతో గుల్లల సంఖ్య కొన్ని ప్రాంతాల్లో తగ్గుతోంది. ఇది సముద్ర పర్యావరణ సమతుల్యతపై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితిని నివారించడానికి పర్యావరణ అనుకూల మత్స్య సంపద నిర్వహణ, కాలుష్య నియంత్రణ, శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రోత్సహించడం అవసరమని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.జాతీయ గుల్ల దినోత్సవం కేవలం సముద్ర ఆహారాన్ని గుర్తు చేసుకునే రోజు మాత్రమే కాదు. సముద్ర సంపదను సంరక్షించాల్సిన బాధ్యతను గుర్తు చేసే సందర్భంగా కూడా దీనిని చూడాలి. ప్రకృతి ప్రసాదించిన ఈ విలువైన జీవులను పరిరక్షించడం ద్వారా సముద్ర జీవావరణాన్ని కాపాడటమే కాకుండా మత్స్యకారుల జీవనోపాధిని కూడా బలోపేతం చేయవచ్చు. స్థిరమైన వినియోగం, శాస్త్రీయ సాగు, పర్యావరణ పరిరక్షణ అనే మూడు సూత్రాలను పాటించినప్పుడే గుల్లల సంపదను భావితరాలకు అందించగలుగుతాం.

# సెయిలర్ అదృశ్యంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన భార్య

**భర్త బతికే ఉన్నాడని భార్య వాదన**

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 :** ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్‌పై జరిగిన డ్రోన్ దాడి అనంతరం గల్లంతైన మర్చంట్ నేవీ కెప్టెన్ ఆశిష్ కుమార్ జీవించి ఉన్నారని పేర్కొంటూ ఆయన భార్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన భర్తను కోర్టు ముందు హాజరుపర్చాలని కోరుతూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. బిహార్‌లోని బెట్టియాకు చెందిన ఆశిష్ కుమార్ ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న స్కైలైట్ చమురు ట్యాంకర్‌కు కెప్టెన్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో డ్రోన్ దాడి జరిగినట్లు సమాచారం. పశ్చిమాసియాలో ఘర్షణలు కొనసాగుతున్న సమయంలో ఈ ఏడాది మార్చిలో ఈ ఘటన చోటుచేసుకుంది.దాడి జరిగిన సమయంలో నౌకలో మొత్తం 10 మంది భారతీయ నావికులు ఉన్నారని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం అప్పట్లో వెల్లడించింది. వారిలో ఎనిమిది మందిని సురక్షితంగా రక్షించగా, కెప్టెన్ ఆశిష్ కుమార్‌తో పాటు మరో సిబ్బంది దలిప్ గల్లంతైనట్లు పేర్కొంది. తర్వాతి రోజు కెప్టెన్ గదిలో కాలిన మానవ శరీర అవశేషాలను ఒమన్ తీర రక్షక దళాలు గుర్తించాయని, ఆ గదిలోకి మరెవరూ ప్రవేశించకపోవడంతో అవి ఆశిష్ కుమార్‌వే అయి ఉండొచ్చని భారత రాయబార కార్యాలయం అప్పట్లో తెలిపింది. అయితే ఈ విషయంపై తుది నిర్ధారణ వెల్లడికాలేదు.ఈ నేపథ్యంలో తన భర్త మరణించలేదని, ఆయన బతికే ఉన్నారని ఆశిష్ కుమార్ భార్య వాదిస్తున్నారు. ఆయన ఆచూకీని గుర్తించి కోర్టు ముందు హాజరుపర్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. దర్యాప్తు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా తదుపరి పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# వాషింగ్టన్‌లో కార్చిచ్చు విలయం

## 65 వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు

## 700కుపైగా ఇళ్లు, నిర్మాణాలు దగ్ధం

## కార్చిచ్చుకు కారణమన్న ఆరోపణలతో వ్యక్తి అరెస్ట్

## రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి ప్రకటించిన ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 4 : అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో కార్చిచ్చులు తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా తూర్పు వాషింగ్టన్‌లోని స్పోకేన్ నగరం, పరిసర ప్రాంతాల్లో మంటలు వేగంగా వ్యాపిస్తుండటంతో సుమారు 65 వేల మందికి పైగా తమ ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఈ విపత్తులో వందలాది ఇళ్లు, ఇతర నిర్మాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అధికారుల వివరాల ప్రకారం స్పోకేన్ నగర పరిసరాల్లో చెలరేగిన మూడు ప్రధాన కార్చిచ్చులు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. ఇది తమ ప్రాంతం చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ప్రకృతి విపత్తులలో ఒకటిగా స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ పేర్కొన్నారు. ప్రాణనష్టం, ఆస్తినష్టంపై అధికారులు సమగ్రంగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు.అమెరికన్ రెడ్ క్రాస్ ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటివరకు 700కుపైగా ఇళ్లు, ఇతర నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు, అత్యవసర సదుపాయాలు అందిస్తున్నారు. 'ఓల్డ్ ట్రెయిల్స్ ఫైర్'కు సంబంధించి ఆరోన్ ఎఫ్. ఫారినా (37) అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉద్దేశపూర్వకంగా మంటలు పెట్టినట్లు ఆరోపిస్తూ అతనిపై ప్రథమ శ్రేణి నేరం కింద కేసు నమోదు చేశారు. ఒక మిలియన్ డాలర్ల పూచీకత్తుతో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు స్పోకేన్ కౌంటీ షెరీఫ్ జాన్ నోవెల్స్ వెల్లడించారు.

మంటల కారణంగా సర్వం కోల్పోయిన బాధితులు తిరిగి తమ ఇళ్లకు చేరుకుని కాలిపోయిన శిథిలాలను చూసి భావోద్వేగానికి గురవుతున్నారు. "ఇక్కడ కాపాడుకోవడానికి ఏమీ మిగల్లేదు" అని 76 ఏళ్ల మిరియం సిమ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రారంభమైన మంటలు ఇప్పటికే 8,026 ఎకరాలకు పైగా విస్తరించాయని అధికారులు తెలిపారు. వాతావరణం కొంత అనుకూలించడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. పరిస్థితిపై రాష్ట్ర గవర్నర్ బాబ్ ఫెర్గుసన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





# వర్షాకాల వ్యాధుల మందులు సిద్ధంగా ఉంచాలి

## కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల, ఆగస్టు 4 : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మందుల నిల్వలు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా బాహ్య, అంతర్గత రోగుల నమోదుకు సంబంధించిన రికార్డులు, ప్రయోగశాల, ఔషధ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, వైరల్ జ్వరాలు, పాముకాటు, కుక్కకాటు వంటి అత్యవసర చికిత్సలకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రిలో గడువు ముగిసిన మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని స్పష్టం చేసిన కలెక్టర్, ఔషధాల నిల్వలను నిరంతరం పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. రోగులకు అవసరమైన అన్ని మందులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీరు, రోగులకు అందించే భోజనం నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం మరింత పెరిగేలా సేవల నాణ్యతను మెరుగుపరచాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత, ఆర్డీవో నరసింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ సూచించిన అంశాలను వెంటనే అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





# సహచరులపై కాల్పులు జరిపిన జవాన్

## ఇద్దరు జవాన్లు మృతి.. మరొకరికి గాయాలు

## ఆ తర్వాత తాను కాల్చుకుని ఆత్మహత్య

## ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు

గువాహటి, ఆగస్టు 4 : అసోంలోని నాగోన్ జిల్లాలోని కాటిమారి ప్రాంతంలో ఉన్న కేంద్ర రిజర్వు పోలీసు దళం 34వ బెటాలియన్ శిబిరంలో మంగళవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ జవాన్ తన సహచరులపై కాల్పులు జరపడంతో ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం కాల్పులకు పాల్పడిన జవాన్ తనపై తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ బల్లాని ప్రేమాంబరం శిబిరం ప్రధాన ద్వారం వద్ద విధుల్లో ఉండగా అకస్మాత్తుగా తన సహచరులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో హెడ్ కానిస్టేబుల్ విష్ణు ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ రమ్నావాల్ సింగ్ యాదవ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు.కాల్పుల్లో మరో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ శ్రీపుల్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సహచరులపై కాల్పులు జరిపిన అనంతరం బల్లాని ప్రేమాంబరం తనపై తాను కాల్పులు జరుపుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాల్పుల శబ్దం విని అధికారులు, ఇతర జవాన్లు ఘటనాస్థలికి చేరుకునేలోపే



అతడు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని అధికా రులు తెలిపారు. వ్యక్తిగత కారణాలా, విధులకు సంబంధించిన ఒత్తిడా, లేక మరే ఇతర కారణమా అనే కోణాల్లో విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై కేంద్ర రిజర్వు పోలీసు దళం, స్థానిక పోలీసులు సంయుక్తంగా విచారణ చేపట్టారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం కాల్పులకు దారితీసిన పరిస్థితులపై స్పష్టత వచ్చే అవకాశముందని అధికారులు తెలిపారు.

# పాకిస్థాన్‌లో భారీ కుంభకోణం కలకలం



ఇస్లామాబాద్, ఆగస్టు 4 : పాకిస్థాన్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర కలకలం రేగింది. దేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణాన్ని తాను వెలుగులోకి తెచ్చినట్లు ఆ దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహ్సిన్ నక్వీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు, బ్యాంకర్లు ఈ వ్యవహారంలో భాగస్వాములయ్యారని, గత 21 ఏళ్లుగా భారీ స్థాయిలో లంచాలు చేతులు మారాయని ఆయన ఆరోపించారు. విలేకరులతో మాట్లాడిన మొహ్సిన్ నక్వీ, ఈ కుంభకోణంలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల పేర్లను మాత్రం వెల్లడించలేదు. కొద్ది రోజుల క్రితం కూడా పాకిస్థాన్ పాలనా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని ఆయన వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న మొహ్సిన్ నక్వీ, సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌కు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఆయన చేసిన ఆరోపణల్లో పౌర సంస్థలపైనే విమర్శలు ఉండగా, సైన్యం ప్రస్తావన లేకపోవడం రాజకీయ విశ్లేషకుల దృష్టిని ఆకర్షించింది. సైన్యం--పౌర ప్రభుత్వాల మధ్య పెరుగుతున్న విభేదాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నక్వీ వ్యాఖ్యలపై ప్రభుత్వంలోనే విభేదాలు వ్యక్తమయ్యాయి. రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ బహిరంగంగానే స్పందిస్తూ, నక్వీ ముందుగా తన సొంత శాఖలో, అలాగే పాకిస్థాన్ క్రికెట్ బోర్డులో సంస్కరణలు చేపట్టాలని సూచించారు. కేబినెట్, పార్లమెంట్ సమావేశాలకు కూడా ఆయన సక్రమంగా హాజరు కావడం లేదని విమర్శించారు.

మరోవైపు పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ నక్వీ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టింది. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అధికార కూటమిలోనే విభేదాలు బయటపడటం పాక్ రాజకీయాల్లో కొత్త పరిణామంగా మారింది. ఇరాన్‌తో దౌత్య చర్చల్లో ప్రత్యేక ప్రతినిధిగా మొహ్సిన్ నక్వీ వ్యవహరిస్తుండటం, సైనిక నాయకత్వంతో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం నేపథ్యంలో ఈ పరిణామాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఆయన వ్యాఖ్యలు నిజంగా భారీ కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చే ప్రయత్నమా, లేక అధికార వర్గాల్లో అంతర్గత శక్తిపోరులో భాగమా అన్న దానిపై పాకిస్థాన్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

# వ్యవసాయ పట్టభద్రుల సమస్యలపై సమీక్ష

## విద్యార్థులతో భేటీ అయిన

## ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 4 : వ్యవసాయ అధికారుల నియామక నిబంధనలకు సంబంధించిన సమస్యలపై వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. విద్యార్థుల వినతిని స్వీకరించిన ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నియామక నిబంధనల్లో చేసిన మార్పుల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వ్యవసాయ పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చట్టబద్ధంగా, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని సంబంధిత ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ పట్టభద్రుల ఉద్యోగ అవకాశాలకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నియామక ప్రక్రియలో తలెత్తిన సమస్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి, నిబంధనలకు అనుగుణంగా పరిష్కార మార్గాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల ఆందోళనలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోందని తెలిపారు.వ్యవసాయ రంగంలో అర్హులైన యువతకు తగిన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నియామక వ్యవస్థలో పారదర్శకతను కొనసాగిస్తూ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేలా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర హోంమంత్రి ప్రియాంక్ ఖర్గేతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యార్థులు వినిపించిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

# జగన్ ది విధ్వంసం క్రెడిట్... మాది అభివృద్ధి క్రెడిట్





## మంత్రులు అనిగాని సత్యప్రసాద్ , నారాయణ తో కలిసి అమరావతి రాజధాని పనులు పరిశీలించిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

### రాజధాని నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి మంత్రి సవిత

అమరావతి, :అమరావతి మొదటి దశ (ఫేస్-1) నిర్మాణ పనులు 2028 ఆగస్టు నాటికి పూర్తిగా పూర్తి చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత శాఖల మంత్రి సవిత తెలిపారు, ఈ సంద ర్భంగా మంత్రులు అనిగాని సత్యప్రసాద్ , నారాయణ తో కలిసి అమరావతి రాజధాని పనులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పరిశీలించారు, అలాగే ఆమె మాట్లాడుతూ...30 వేల మందికిపైగా కార్మికులు రేయింబవళ్లు పనిచేస్తున్నారన్నారు,ప్రపంచంలోనే అత్యంత పొడవైన సెక్రటేరియట్ భవనాన్ని 210 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నా మన్నారు,ప్రజలకు ఒకే దగ్గర సేవలు అందించేలా ఒకేచోట సచివాలయం, హెచ్ ఓడీ టవర్లు నిర్మిస్తున్నామన్నారు,ఇప్పటికే నెలపాడులోని ఎమ్మెల్యే, ఎం ఎల్ సి టవర్ల నిర్మాణం పూర్తయ్యాయన్నారు,ఆగస్టు 15న ఈ టవర్లను ఎమ్మెల్యే, ఎం ఎల్ సి లకు అందజేయనున్నారన్నారు,2028 నాటికి సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ తదితర ఐకానిక్ భవనాల నిర్మాణాలను పూర్తి చేయబోతున్నా మన్నారు,సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ ఎప్పటి కప్పుడు కాంట్రాక్టు సంస్థలతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ... పనులు పర్యవేక్షిస్తూ వస్తున్నారు,సీడ్ యాక్సెస్ రోడ్డు, కనెక్టివిటీ రోడ్ల నిర్మాణ పనులు కూడా పురోగతిలో ఉన్నాయన్నారు,జగన్ రాష్ట్రాభివృద్ధికి సైంధవుడిలా అడ్డుతగులుతున్నాడన్నారు,ప్రపంచం మెచ్చేలా గ్రీన్ ఫీల్డ్ రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మిస్తుండడం చూసి జగన్ ఓర్వలేకపోతున్నాడన్నారు,హైటెక్ సిటీ సైబరాబాద్ ను నిర్మించి ఇప్పటికే ప్రపంచ పటంలో సీఎం చంద్రబాబు నిలిచిపోయారన్నారు,ఇప్పుడు మరో రాజధాని అమరావతిని నిర్మించి ప్రజల గుండెల్లో సీఎం చంద్రబాబు శాశ్వత గూడు కట్టుకోవడం జగన్ కు ఇష్టం లేదన్నారు,అందుకే, అమరావతి రాజధానికి అడు గడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నాడన్నారు,2019 ఎన్నికల ముందు అమరావతికి జై కొట్టాడు... రాజధానిలోనే ఇల్లు కట్టుకున్నాని ప్రజలను మోసగించాడ న్నారు,అధికారంలోకి రాగానే తన అసలు రూపాన్ని జగన్ బయటపెట్టాడన్నారు,3 రాజధానులు అంటూ 5 ఏళ్లలో ఏ ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేయలేదన్నారు,రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని మార్చేశారన్నారు,3 ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేశాడన్నారు,ప్రజలు ఛీ కొట్టడంతో... ఇప్పుడు మావిగన్ అంటూ మరో డ్రామా ఆడుతున్నాడ న్నారు,మావిగన్ ఎక్కడుందో కూడా తెలియని అజ్ఞాని జగన్ అని ఎద్దేవా చేశారు,జగన్ ఎన్ని కుట్రలు పన్నినా... తెలుగు జాతి గర్వపడేలా అమరావతి రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మించి తీరుతారన్నారు,జగన్ ది విధ్వంసం క్రెడిట్... మాది అభివృద్ధి క్రెడిట్ అన్నారు,రప్పా రప్పా నరకడం, విధ్వంసం, దోపిడీ, అరాచకం జగన్ క్రెడిట్,దౌర్భాగ్యపు జగన్ క్రెడిట్ లు కావాలని ఎవరూ ఆశించరన్నారు,నిరసనల పేరుతో రాష్ట్రంలో జగన్, వైసీపీ నాయకులు విధ్వంసం సృష్టిస్తున్నా రన్నారు,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు, మంత్రులు నివాసాలు అద్భుతంగా నిర్మించారని మంత్రి సవిత తెలిపారు.





# ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ స్పాట్ అడ్మిషన్లు ఆగస్టు 10కి వాయిదా



ధర్మవరం,:-స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీన నిర్వహించాల్సి ఉన్న స్పాట్ అడ్మిషన్లు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈనెల 10వ తేదీకి వాయిదా పడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలియజేయడం జరిగింది. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలు పొందగోరు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రవేశం పొందగోరే విద్యార్థులు ఆగస్టు 10వ తేదీన ఉదయం కళాశాలకు నేరుగా వచ్చి హాజరుకావాలని సూచించారు. హాజరుకావాల్సిన విద్యార్థులు తీసుకురావాల్సిన ఒరిజినల్ సర్టిఫికెట్లు:

1. 10వ తరగతి మార్కుల మేమో
2. బదిలీ సర్టిఫికెట్ (టీసీ )
3. కుల ధ్రువీకరణ పత్రం
4. ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ (ఓ సి )
5. 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు

అర్హత గల విద్యార్థులందరూ పైన పేర్కొన్న ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు వాటి జిరాక్స్ కాపీలను తీసుకుని నిర్దేశిత తేదీన ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేరుగా హాజరుకావాల్సిందిగా ప్రిన్సిపాల్ తెలియజేయడం జరిగింది.

# జొన్నల కొత్తపల్లి లో ఈ-పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

### ముఖ్య అతిథులుగా హాజరైన మండల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు

ముదిగుబ్బ, : ముదిగుబ్బ మండలం, జొన్నల కొత్తపల్లి



పంచాయతీ పరిధిలోని రాళ్ల అనంతపురం జొన్నలకొత్తపల్లి, రెవెన్యూ గ్రామాల్లో ముదిగుబ్బ మండలం సి ఎస్డీటీ ముని స్వామి, రెవిన్యూ సిబ్బంది ఆధ్వర్యంలోఈ -పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేపట్టారు. రీ సర్వే చేయించబడిన రైతులకు క్యూఆర్ కోడ్



తో కూడిన కొత్త పాస పుస్తకాలను అందించారు. తద్వారా పారదర్శకత మరియు సంక్షేమ పథకాలు తెలుసుకునే విధంగా వెసులుబాటు ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర యాదవ సంఘం కార్యదర్శి చినగాని నరసింహ యాదవ్, మలక వేముల టిడిపి గ్రామ కార్యదర్శి బండి మల్లికార్జున, ప్రభాకర్ చౌదరి, రాష్ట్ర రైతు సంఘు కార్యదర్శి భాసినేని రమేష్ బాబు, కోట్ల బాబి తదితర నాయకులు పాల్గొన్నారు.

# 7న ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

తాడిపత్రి, : తాడిపత్రి నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే ఉద్దేశంతో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన "ప్రజాదర్బార్" కార్యక్రమం నిర్వహించ నున్నట్లు టీడీపీ నాయకులు ఎస్.వి. రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు తాడిపత్రి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణాలకు చెందిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన ఫిర్యాదు లను నేరుగా ఎమ్మెల్యేకు వినిపించి పరిష్కారం పొందాలని ఆయన కోరారు.ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్.వి. రవీంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# శ్రీ మండలి వెంకట కృష్ణారావు ఆశయాలు సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్

అనంతపురం, :శ్రీ మండలి వెంకట కృష్ణారావు ఆశయాలు, సేవాస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, మండలి వెంకటకృష్ణా రావు గారి శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ మాట్లాడుతూ....మండలి వెంకటకృష్ణ రావు గారు 1926 ఆగస్టు 4న కృష్ణాజిల్లా పల్లెవాడ గ్రామంలో జన్మించార న్నారు. చిన్ననాటి నుంచే గాంధీజీ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని దేశభక్తి నిజాయితీ సేవాభావంతో ప్రజా జీవితంలో అడుగు పెట్టారు. స్వాతంత్రో ద్యమంలో పాల్గొని అనంతరం ప్రజాసేవనే తన జీవిత లక్ష్యంగా మార్చుకున్నారు. 1957లో లోక్ సభ సభ్యుడిగా 1972లో అవనిగడ్డ నియోజకవర్గం నుండి ఏకగ్రీవంగా శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని పొందారు. రాష్ట్ర మంత్రిగా, విద్య సాంస్కృతిక సాంఘిక సంక్షేమ, మత్స్య శాఖ వంటి కీలక శాఖలను సమర్ధవంతంగా నిర్వహించి ప్రజల సంక్షేమానికి విశేష సేవలు అందించారు. దివిసీమ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయ మైనవి వేలాది ఎకరాల బంజరు భూములను పేదలకు పంపిణీ చేయడం రైతులు మత్స్యకారులు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలను అమలు చేయడం ఆయన ప్రజాహిత దృక్పథానికి నిదర్శనమన్నారు.తెలుగు భాషా సంస్కృతులు అభివృద్ధికి ఆయన చేసిన కృషి విశేషమైనది 1975లో హైదరాబాదులో జరిగిన ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతంగా నిర్వహించి ప్రపంచ తెలుగు ప్రజలను ఒకే వేదిక పైకి తీసుకు వచ్చారు. అంతర్జాతీయ తెలుగు కేంద్రానికి తొలి అధ్యక్షుడిగా సేవలందించి తెలుగు భాషకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. విద్యాశాఖ మంత్రిగా విద్యాసంస్కరణలు చేపట్టి ఉపాధ్యాయ దినోత్స వాన్ని గురుపూజో త్సవముగా నిర్వహించే సంప్రదాయాన్ని ప్రారంభించారు. బాలల ప్రతిభను వెలికి తీయడానికి ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ స్థాపనకు కూడా కృషి చేశారు. మండలి వెంకటకృష్ణా రావు వ్యక్తిత్వం ఎంతో ఆదర్శప్రాయమైనది నిరాడంబర జీవితం నిజాయితీ మానవతా దృక్పథం గాందేయ విలువల పట్ల అచంచల విశ్వాసం ఆయన జీవితాన్ని మహోన్నతంగా నిలిపాయి. బాధలో ఉన్న వారిని మనమే ముందుగా వెళ్లి ఓదార్చలి అనే ఆయన సందేశం నేటికీ మనందరికీ మార్గదర్శకం,ఆయన శత జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజాభి వృద్ధికి ప్రతి ఒక్కరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, జిల్లా టూరిజం అధికారి రమణారెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే ఏడి కనక ప్రసాద్ రావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ముదిగుబ్బలో తల్లిపాల వారోత్సవాలు

### తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

ముదిగుబ్బ, : పుట్టిన బిడ్డకు తల్లిపాలే తొలి రక్షణ అని ముదిగుబ్బ మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక పి హెచ్ సి లో తల్లిపాల వారోత్సవాలు వైద్య సిబ్బంది మరియు అంగన్వాడి ఆశ వర్కర్లతో కలసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రసవించిన వెంటనే బిడ్డకు తల్లిపాలు తాగించడం ద్వారా



అత్యంత పోషక విలువలు శిశువుకు అందుతాయని తద్వారా బిడ్డ ఆరోగ్యం గా తయారవుతారని తెలిపారు. శిశువుకు ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించడం అత్యంత ఉత్తమమని పేర్కొన్నారు.

# ఎల్ నినో నేపథ్యంలో త్రాగు నీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టి నిరంతర పర్యవేక్షణ ఉండాలి

### ప్రజా ఫిర్యాదులపై దృష్టి పెట్టి సకాలంలో పరిష్కరించండి

### పుట్లూరు మండలంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సుడిగాలి పర్యటన

అనంతపురం,:ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజల ఫిర్యాదులపై దృష్టి పెట్టి సకాలంలో పరిష్కరించాలని, త్రాగు నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు.మంగళవారం పుట్లూరు మండలంలో జిల్లా కలెక్టర్ పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఆయా శాఖల మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పించుకోకుండా పరిష్కార మార్గాలను చూడాలన్నారు. పుట్లూరు మండలం నుంచి జిల్లా కేంద్రంలో జరిగే పీజిఆర్ఎస్ కు వందల సంఖ్యలో సమస్యలు వస్తున్నాయని, మండల కేంద్రంలో సక్రమంగా పరిష్కారం చేస్తే అక్కడ వరకు రావాల్సిన అవసరం లేదని, పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండరాదని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఎల్నినో నేపథ్యంలో ఏ ఒక రైతు కూడా నష్టపోకూడదని, వారికి ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలలో ఎక్కడ కూడా త్రాగునీటి సమస్య లేకుండా బోర్లను నిరంతరం పర్యవేక్షించాలని, సోర్స్ నీటిమట్టం గమనిస్తుండాలని, ముందే ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మరియు ఏ పి సి ఎన్ ఎఫ్ ప్రకృతి వ్యవసాయం అధికారులతో సమన్వయం చేసుకోవాలని, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని, యాక్షన్ ప్లాన్ తయారు చేసి ప్రణాళికాబద్ధంగా పని చేయాలని ఆదేశించారు, ఈ సమావేశంలో తహసీల్దార్ బాలమ్మ, ఎంపిడిఓ అలివేలమ్మ, ఎంఈవో శ్రీదేవి, వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయని, వెటర్నరీ డాక్టర్ సువర్ణ, డిప్యూటీ ఎంపిడిఓ లు బాబా ఫక్రుద్దీన్, శివ ప్రసాద్, ఏపీ ఏం ఖలీం, ఏపీఓ తులసి ప్రసాద్, తదితర అధికారులు పాల్గొన్నారు.





# పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

### జిల్లా ఎస్పీ పి.జగదీష్

### ఘనంగా... పోలీస్ రక్షక్ ప్రీ - ప్రైమరీ స్కూల్ ఫౌండేషన్ డే వేడుకలు

అనంతపురం,:పోలీసు పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించడమే జిల్లా పోలీసుశాఖ లక్ష్యమని జిల్లా ఎస్పీ పి.జగదీష్ వెల్లడించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మంగళ వారం పోలీస్ రక్షక్ ప్రీ - ప్రైమరీ స్కూల్ ఫౌండేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ పాల్గొని ప్రసంగించారు. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రయివేట్ పాఠశాలల కంటే మెరుగ్గా ఇక్కడ పాఠశాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. విద్యతో పాటు సైకర్యాలు కూడా మెరుగ్గానే ఉన్నాయన్నారు. ఆర్డీటీ వారి సహకారంతో స్పానిష్ లాంగ్వేజ్ కూడా అదనంగా పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. చిన్న వయస్సులో అయితే మంచిగా నేర్చుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకునే వీలుంటుంద న్నారు. చదువులతో పాటు పిల్లలకు ఆటలు ముఖ్యమన్నారు. బాల్యం నుండే చదువుతో పాటు క్రీడలు, ఆటలకు అలవాటు పడేలా ఇటు ఉపాధ్యాయులు... అటు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలు, సిబ్బందిని ఎస్పీ సన్మానించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం, ఇలియాస్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, డిస్కవరి అనంతపురం సంస్థ నిర్వాహకులు అనిల్, ఆర్ ఐ లు పవన్ కుమార్ , రాముడు, పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొని పిల్లలను ఆశీర్వదించారు.





# యెల్నినో పై శాస్త్రవేత్తల అవగాహన ర్యాలీ

తాడిమర్రి, : యెల్నినో పై మంగళవారం ఉదయం 10:00 నుండి సాయంత్రం వరకు మండలంలోని జిల్లా వారి పల్లి దాడి తోట పెద్దకోట్ల కురుకుంట్ల తాడిమర్రి నిడిగల్లు అగ్రహారం రైతు సేవ కేంద్రాల్లో ఆచార్య ఎన్జీరంగా విశ్వ విద్యాలయం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ శంకర్ బాబు, డాక్టర్ రాధ కుమారి, ఏ ప్రకాష్ ఎస్ కే సి ఏ ఎస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థానిక డివిజనల్ అధికారి లక్ష్మీ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి శేఖర్ నాయక్ ప్రకృతి సిబ్బంది రైతు సేవ కేంద్రం అధికారులు రైతులు ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు, వర్షాభావ పరిస్థితుల పైన సమగ్ర అవగాహన కల్పించడం జరిగినది అదేవిధంగా రైతులతో ర్యాలీ నిర్వహించారు ,అదేవిధంగా క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించి యెల్నినో ప్రభావము గురించి ఏ రకంగా రైతులు సమా యత్తమై ప్రత్యామ్నాయ పంటలైన ఉలువలు పెసలు మినుములు జొన్నలు కొర్రలు ఒంటిపంటలను సాగు చేసుకోవాలి వరిని పూర్తిగా నిర్మూలించాలి ప్రస్తుతం ఆరుతడి పంటలే రైతును ఈ తీవ్రమైనటు వంటి వర్షాభావ పరిస్థితుల నుండి గట్టెక్కించగలరని తెలియ జేశారు, అంతేకాకుండా ఈ సంవత్సరం సమగ్ర వ్యవసాయ సాగులో పొట్టేళ్ల పెంపకం ద్వారా రైతులకు లాభం చేరుకుంటుందని తెలియ జేశారు, పండ్ల తోటల్లో అపరాలు సాగు చేసినట్లయితే పంటతోపాటు నేలకు కూడా సారవంతం లభిస్తుందని తెలియ జేశారు, ఈ కార్యక్రమంలో భాగంగా తాడిమర్రి మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మానవహారం చేయించారు, ప్రజలు కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రంగారావు, మండల డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఎండిఓ విజయ శేఖర్ నాయుడు,ఎంఈఓ వెంకటేశ్వర్లు, తాడిమర్తి ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీమతి అరుణ కుమారి, ఏ ఈ ఓ వైష్ణవి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, నాగమణి, ప్రవల్లిక, గౌతమి, రైతులు పకీరు గాళ్ళ గణేష్, పాల్గొన్నారు.




# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి.

### -పురం వైసిపి ఇంచార్జ్ దీపిక

హిందూపురం: మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలని,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం సమన్వయకర్త టీ.ఎన్. దీపిక వేణురెడ్డి డిమాండ్ చేశారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం హిందూపురంలోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం వెంటనే సీబీఐతో విచారించాలని సమావేశంలోతీర్మానించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఎం. అగ్రహారం గ్రామంలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ

### రైతుల భూ హక్కులకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తోంది

### తాడిమర్రి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రి సత్యకుమార్,హరీష్ బాబు

తాడిమర్రి, తాడిమర్రి మండలం లోని ఎం. అగ్రహారం గ్రామంలో మంగళవారం పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, తొండూరు రెడ్డి లక్ష్మి డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్ రెడ్డి, ప్రజాప్రతి నిధులు, గ్రామ పెద్దలు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఎం. అగ్రహారం రెవెన్యూ పరిధికి సంబంధించిన మొత్తం 1,630 పట్టాదార్ పాస్ పుస్తకాలలో తొలి విడతగా సుమారు 200 మంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తమ భూ హక్కులను అధికారికంగా గుర్తించి పాస్ పుస్తకాలు అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందన్నారు. రైతుల భూములకు సంబంధించిన హక్కులను పరిరక్షించడం, భూ రికార్డులను పార దర్శకంగా నిర్వహించడం, ప్రతి అర్హ రైతుకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకం రైతుకు అత్యంత విలువైన పత్రం అని, భూమి యాజ మాన్యానికి చట్టబద్ధమైన గుర్తింపుతో పాటు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పంట రుణాలు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం ఇది ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. మిగిలిన అర్హులైన రైతులకు కూడా త్వరితగతిన పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో ధర్మవరం నియోజకవర్గంలో రైతులకు సంబంధించిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ, రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు చేపడుతున్నా మని హరీష్ బాబు పేర్కొన్నారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని పేర్కొన్న హరీష్ బాబు, ముఖ్యంగా తాడిమర్రి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా అమలవుతున్నాయని వివరించారు.తాడిమర్రి మండలంలోని పుల్లఓబయ్యపల్లి--పిన్నదరి--పీఎన్ పల్లి మీదుగా తాడిమర్రి పుల్లంపల్లి వరకు 8.8 కిలోమీటర్ల బీటీ రహదారి పునర్నిర్మాణ పనులు రూ.3 కోట్లతో కొనసాగుతున్నాయని, అలాగేధర్మవరం--తాడిపత్రి ప్రధాన రహదారి నుంచి నర్పింపల్లి మీదుగా నిడిగల్లు వరకు 6.1 కిలోమీటర్ల బీటీ రహదారి పనులు రూ.2 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా నిడిగల్లు నుంచి శివంపల్లి రీచ్-1, 2, 3, 4 వరకు 3 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి రూ.1.75 కోట్లు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా తాడిమర్రి మండలంలోని 133 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.1.62 కోట్ల ఆర్థిక సాయం అందించామని, అలాగే ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు 988 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.10.14 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం అందించడం జరిగిందని హరీష్ బాబు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తాడిమర్రి మండలంలోని పిన్నదరి, శివంపల్లి గ్రామాల్లో ఒక్కో గ్రామానికి రూ.2.60 లక్షల వ్యయంతో ఆర్వో వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పశుసంవర్ధక రంగానికీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొంటూ, ధర్మవరం నియోజకవర్గం లో శిథిలావస్థకు చేరుకున్న నాలుగు పశువైద్య ఆసుపత్రుల భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా వాటికి మంజూరు లభించిందని తెలిపారు.ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలతో ముందుకు సాగుతోందని హరీష్ బాబు అన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సేవలు మరింత ప్రజలకు చేరువవు తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ కింద రూ.9 వేల కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం కేవలం రెండు సంవత్సరాల్లోనే ఎన్టీఆర్ వైద్య సేవల కింద రూ.7 వేల కోట్లు ఖర్చు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అంది స్తోందని వివరించారు.రైతు సంక్షేమం, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాల అమలులో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తున్నారని హరీష్ బాబు పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు.ఈ పంపిణీ కార్యక్రమంలో ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, ఎమ్మార్వో రెడ్డి లక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్ చ ల్లం భాస్కర్ రెడ్డి, వీఆర్వో రామాంజి, బిజెపి మండల అధ్యక్షులు దేవర రామ్మోహన్,చింతల వన్నూరు రెడ్డి, ఆర్వేటి ఆనంద్, అనుగుత్తి రమణ, బిల్లే చంద్రమోహన్,లక్ష్మీనారాయణ, నాగార్జున, ఎన్డీఏ కూటమి నాయకులు, రెవెన్యూ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భిక్షాటన నిర్మూలనకు జేసీ ప్రభాకర్ రెడ్డి వినూత్న శ్రీకారం

## 200 కుటుంబాలతో అవగాహన కార్యక్రమం

## న్నారుల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

## జెసి సేవా కార్యక్రమానికి ప్రజల నుంచి అనుహస్పందన

తాడిపత్రి, : తాడిపత్రిని భిక్షాటన రహిత పట్టణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భిక్షాటన చేస్తున్న సుమారు 200 కుటుంబాలతో 600 మంది పిల్లలతో మంగళవారం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా భిక్షాటనలో జీవిస్తున్న కుటుంబాలకు రెండు విడతల్లో ఇంటి స్థలాలు మంజూరు చేసినప్పటికీ, వాటిపై ఇళ్లు నిర్మించు కోలేకపోయారని తెలిపారు, ఈ కుటుంబాలు సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపాలని, వారి సంక్షేమమే తన లక్ష్యమని చెప్పారు. భిక్షాటన చేస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠ శాలలకు పంపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే చదువే మార్గం" అంటూ భావోద్వేగంగా పిలుపు నిచ్చారు. చిన్నారులకు రంగులు పూసి భిక్షాటన చేయించడం వారి ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు. ఇకపై ఆలయాల వద్ద చిన్నారులతో భిక్షాటన చేయిస్తే, వారిని దత్తత తీసుకుని ఆశ్రమాల్లో చేర్పించి విద్య అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భిక్షాటన చేస్తున్న చిన్నారుల సంక్షేమం కోసం తన భార్య జేసీ ఉమారెడ్డి రూ.10 లక్షల విరాళం ప్రకటించినట్లు వెల్లడించారు. కొంతమంది రాజకీయ నాయకులు ప్రకటనలకే పరిమిత మవుతున్నారని, తాము మాత్రం ఆచరణలో పనిచేస్తున్నామని వ్యాఖ్యానించారు. హాజరైన చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. పెరిగిన వారికి జుట్టును నాయి బ్రాహ్మణుల సహకారంతో కట్టింగ్ చేయించిన అనంతరం వారికి అందమైన దుస్తులు కూడా పంపిణీ చేశారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన తాడిపత్రి ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటామ న్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి చేస్తున్న వినూత్న కార్యక్రమం పట్ల ప్రజల్లో మంచి స్పందన లభిస్తుంది. ఈ కార్యక్రమంలో జేసి ఉమారెడ్డి మాట్లాడుతూ తాను తాడిపత్రిలో ఉన్న శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి, వెంకటరమణ స్వామి, సాయిబాబా ఆలయాల వద్దకు వెళ్ళినప్పుడు భిక్షాటన చేసే వారిని, వారి పిల్లలను చూసి తన మనసుకు బాధ కలిగించిందన్నారు. వారు ఏదో విధంగా సాయం చేయాలని తన భర్త జెసి ప్రభాకర్ రెడ్డికి చెప్పడంతో ఆయన సూచన మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ, సహకారాలు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.





# భద్రతా బాండ్ ఉల్లంఘించి హత్య కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదు ర్కొంటున్న వ్యక్తికి 2,నెలల ఐదు రోజులు రిమాండ్ విధింపు

## బాండ్ గడువు ముగిసే వరకు నిర్బంధ ఉత్తర్వులు

## బీఎన్ఎస్ఎస్ నిబంధనల మేరకు

## కదిరి సబ్‌జైలుకు తరలింపు

పుట్టపర్తి,:శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు అధికారి ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, భద్రతా బాండ్ నిబంధనలను ఉల్లంఘించిన నింది తుడిపై బీఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం నిర్బంధ ఉత్తర్వులు అమలు చేసి కదిరి సబ్‌జైలుకు తరలించినట్లు కదిరి డీఎస్పీ శివన్నారాయణ స్వామి తెలిపారు, మంగళవారం కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో టౌన్ సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి డి.ఎస్.పి ఈ వివరాలను వెల్లడించారు. బాండ్ అమల్లో ఉండగానే మరో హత్య కేసులో నిందితుడుకదిరికి చెందిన షేక్ వలి బాషా (29) గతంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126 ప్రకారం ఒక సంవత్సరం పాటు మంచి ప్రవర్తన పాటిస్తానని రూ.5 లక్షల విలువైన భద్రతా బాండ్‌ను అమలు చేశాడు. అయితే బాండ్ గడువు కొనసాగుతున్న సమయంలోనే కదిరి రూరల్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 24/2026లో బీఎన్ఎస్ సెక్షన్ 118(1), 3(5) కింద నమోదైన హత్య కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొనడంతో బాండ్ షరతులను ఉల్లంఘించి నట్లు పోలీసులు గుర్తించారు.

షోకాజ్ నోటీసుకు స్పందించని నిందితుడు..

బాండ్ ఉల్లంఘన నేపథ్యంలో సంబంధిత అధికారుల ద్వారా షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ ఇవ్వడంతో పాటు జప్తు చేసిన రూ.5 లక్షల బాండ్ మొత్తాన్ని చెల్లించేందుకు అవకాశం కల్పించారు. అయినప్పటికీ నిందితుడు సంతృప్తి కరమైన వివరణ ఇవ్వకపోవడంతో పాటు బాండ్ మొత్తాన్ని కూడా చెల్లించలేదని డీఎస్పీ తెలిపారు. నేర చరిత్రను పరిగణనలోకి తీసుకున్న అధికారులు విచారణలో నిందితుడిపై గతంలో కూడా పలు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అతడు అలవాటుగా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిగా నిర్ధారణకు



రావడంతో, అతని కార్యకలాపాలు ప్రజా శాంతి, భద్రత మరియు సామాజిక ప్రశాంతతకు భంగం కలిగించే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. బీఎన్ఎస్ఎస్ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలునిందితుడి వద్ద జప్తు చేయదగిన ఆస్తులు లేకపోవడంతో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 141(1)(బి), సెక్షన్ 142(5) నిబంధనల ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ వివరించారు.

కదిరి సబ్‌జైలులో నిర్బంధానికి ఉత్తర్వులు.. ఎం.సి. నంబర్ 281/2026-ఎ, తేదీ 04-08-2026 ప్రకారం, షేక్ వలి బాషాను భద్రతా బాండ్ గడువు ముగిసే 09-10-2026 వరకు లేదా సంబంధిత న్యాయస్థానం నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కదిరి సబ్‌జైలులో నిర్బంధించాలని ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఉత్తర్వుల తక్షణ అమలుఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే అమలు చేసి నిందితుడిని కదిరి సబ్‌జైలుకు తరలించాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా కేసును చట్టపరంగా సమర్థవంతంగా నిర్వహించిన కదిరి టౌన్ సీఐ వెంకటేశ్వర్లు మరియు పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు చేపట్టిన శ్రీ సత్య సాయి జిల్లా పోలీసులు

## హిందూపురంలో ముగ్గురు..కదిరిలో ఆరుగురు..ఒక్కొక్కరికి 10000 చొప్పున 9 మందికి 90000 రూపాయలు జరిమానా

పుట్టపర్తి, :జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాలు, అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్, కదిరి డిఎస్పి శివన్నారాయణ స్వామి, పర్యవేక్షణలో హిందూ పురం రూరల్, మరియు కదిరి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 9 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం నిందితులను హిందూపురం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్, కదిరి న్యాయస్థానంలో హాజరుపరచగా, విచారణ అనంతరం ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని కదిరి పట్టణ సిఐ వెంక టేశ్వర్లు , హిందూపురం రూరల్ అప్గ్రేడ్ ఎస్సై మునీర్ అహ్మద్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్, ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపవద్దని, రోడ్డు భద్రతా నిబంధ నలను తప్పనిసరిగా పాటించి తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

## ఐసిడిఎస్ సూపర్ వైజర్ యు అరుణమ్మ

ధర్మవరం,:ధర్మవరం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని రాజేంద్రనగర్ 2, 3, 4 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లిపాల వారోత్సవాలు



మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గర్భిణులు, బాలింతలు మరియు చిన్నపిల్లల తల్లులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ యు. అరుణమ్మ తల్లిపాల ప్రాముఖ్యత మరియు వాటి విశిష్టత గురించి అవగాహన కల్పిస్తూ క్రింది విషయాలను తెలియజేశారు, తల్లి పాలు అమృతం,బిడ్డ పుట్టిన 1 గంట లోపే ముర్రిపాలు తప్పనిసరిగా పట్టించాలన్నారు, బిడ్డ అడిగిన వెంటనే:బిడ్డ ఏడ్చినప్పుడు లేదా కోరినప్పుడల్లా తల్లిపాలు ఇవ్వాలన్నారు,ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే: బిడ్డకు 6 నెలలు నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు, తల్లిపాలలో రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) ని పెంచే గుణం ఉంటుంది, ఇది బిడ్డను అనేక వ్యాధుల నుండి కాపాడుతుందన్నారు,7వ నెల నుండి తల్లిపాలతో పాటు పౌష్టికాహారాన్ని అదనపు ఆహారంగా అందించాల న్నారు, 2 సంవత్సరాల లోపు పిల్లల్లో 90 శాతం మెదడు అభివృద్ధి జరుగుతుందని వివరిస్తూ తల్లిపాల ప్రాధాన్యతను తెలియ జేశారు ,6 నెలల్లోపు పిల్లలకు తేనె, డబ్బా పాలు, ఆవు పాలు, నీరు వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ పట్టకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ యు. అరుణమ్మ, జిఎంఎస్కే అనసూయ, ఏఎన్ఎం శివమ్మలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు దీనా, లక్ష్మీదేవి, ఇమ్రాన్ మరియు ఆశా వర్కర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# ముదిగుబ్బలో ఆర్టీసీ బస్సు-ద్విచక్ర వాహనం ఢీ

## ద్విచక్ర వాహనదారుడు మృతి



ముదిగుబ్బ, : ముదిగుబ్బ మండలం దొరుగల్లు రోడ్డు లోని నర్సరీల సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముదిగుబ్బ మండల కేంద్రానికి చెందిన రైతు కమలాకర్ (55) తలకు తీవ్ర గాయాలు అవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పులివెందుల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మరియు రైతు కమలాకర్ యొక్క ద్విచక్ర వాహనం ఢీ కొనడం తో ప్రమాదం జరిగింది, టమోటా తోటకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్టు స్థానిక సమాచారం. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఘటనపై ముదిగుబ్బ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బిజెపి ఎస్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు గా తిరుపాల్ నాయక్

ముదిగుబ్బ, :ముదిగుబ్బ మండలానికి చెందిన ఇస్లావత్ తిరుపాల్ నాయక్ ను భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాష్ట్ర నాయకత్వం నియమించింది. తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని,గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తానని, వారి అభ్యున్నతికి తోడ్పడు తానని పేర్కొన్నారు.



# 16 కిలోలు తగ్గిన సల్మాన్ ఖాన్..

బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ సడన్‌గా 16 కిలోలు తగ్గిన సంగతి తెలిసిందే. దీంతో అతడి ఆరోగ్యం బాలేదంటూ వార్తలు రావడంతో సల్మాన్‌కి ఏమైందంటూ పలువురు అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అయితే తన ఫిట్‌నెస్ మరియు శరీర బరువులో వచ్చిన భారీ మార్పులపై వస్తున్న రకరకాల వార్తలకు ఎండ్ కార్డ్ పడేశారు సల్మాన్. ఇటీవల కాలంలో ఆయన పబ్లిక్ ఈవెంట్లలో చాలా సన్నగా కనిపించడంతో, ఆయన ఆరోగ్యంపై సోషల్ మీడియాలో మరియు అభిమానుల మధ్య తీవ్రమైన చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రైమ్ వీడియో నిర్వహించిన ప్రత్యేక 'అలయన్స్' ఈవెంట్‌లో సల్మాన్ స్వయంగా తన ఆరోగ్య రహస్యాన్ని బయటపెట్టారు. ఈ వేదికపై తన తమ్ముడు సోహైల్ ఖాన్‌తో కలిసి ముచ్చటించిన సల్మాన్ ఖాన్, తాను ఎలాంటి అనారోగ్యంతో బాధపడడం లేదని స్పష్టం చేశారు. తన రాబోయే చిత్రాల కోసం మరియు ప్రత్యేకమైన ఫిట్‌నెస్ లక్ష్యాలను సాధించడం కోసం ఉద్దేశపూర్వకంగానే బరువు తగ్గానని ఆయన వెల్లడించారు. ఈ క్రమంలో ఆయన దాదాపు 16 కిలోల బరువును తగ్గించుకున్నట్లు తెలిపారు. కఠినమైన డైట్ ప్లాన్, క్రమశిక్షణతో కూడిన వ్యాయామాల వల్లే ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో సోహైల్ ఖాన్ కూడా తన ఫిట్‌నెస్ జర్నీ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తను సైతం 12 కిలోలు తగ్గి, తన ఫిట్ బాడీతో ఆబ్స్‌ను ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ, తన ఆరోగ్యం పూర్తిగా నిలకడగా ఉందని, అభిమానులు ఎలాంటి అపోహలకు లేదా ఆందోళనలకు గురికావద్దని కోరారు. రాబోయే ప్రాజెక్ట్‌లలో సరికొత్త లుక్‌తో అలరించడానికి తాను సిద్ధమవుతున్నానని ఆయన ఈ సందర్భంగా చెప్పుకోచ్చాడు.



# గచ్చిబౌలిలో ప్రభాస్ ఫౌజీ షూటింగ్ !

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి--లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్రబృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25 రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు.



# త్రిషపై వివాదాస్పద వ్యాఖ్యలు.. ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్.!

నటి త్రిషను ఉద్దేశించి డీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ చేసిన డబుల్ మీనింగ్ వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాల్లో భారీ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ వివాదానికి సంబంధించి తంజావూరు పోలీస్‌స్టేషన్‌లో పలువురు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఉదయనిధిపై తీవ్రమైన ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే చెన్నైలోని ఆయన నివాసంలో ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనపై నమోదైన కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కోరుతూ ఆయన హుటాహుటిన ముందస్తు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తుంది. ఇక ఈ పిటిషన్‌ను విచారించిన మద్రాస్ హైకోర్టు, మధ్యాహ్నం వరకు ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్టు చేయవద్దంటూ పోలీసులను ఆదేశించింది. కావేరి జలాల సాధన నిరసన సభలో సీఎం విజయ్‌ను లక్ష్యంగా చేసుకుని ఉదయనిధి మాట్లాడుతున్న సమయంలో సభలోని డీఎంకే కార్యకర్తలు ఒక్కసారిగా "త్రిష.. త్రిష" అంటూ గట్టిగా అరిచారు. అయితే కార్యకర్తల తీరును వారించాల్సిన ఉదయనిధి, నవ్వుతూ ద్వంద్వార్థలు వచ్చేలా వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఎక్కడ నీళ్లు వచ్చినా రాకపోయినా అక్కడ మాత్రం నీళు రావాలంటూ ఆయన చేసిన కామెంట్లు వివాదాస్పదం కాగా, ఆ తర్వాత తాను కావేరి జలాల గురించే మాట్లాడానని కవర్ చేసుకునే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే ఈ వ్యాఖ్యలు వివాదంగా మారాయి.

# ఈ పాత్రనే ఎందుకు ఎంచుకుందో ...

నితీష్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం రామాయణం పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. భారతీయ ఇతిహాసాన్ని అత్యాధునిక సాంకేతికతతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో పలువురు స్టార్ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముఖ్యంగా శూర్పణఖ పాత్రలో నటిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్ లుక్ ఇటీవల విడుదలైన ప్రచార చిత్రాలతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ట్రైలర్‌లో రకుల్ కనిపించిన తీరు, ఆమె ప్రత్యేకమైన గెటప్, ఆభరణాలు, కాస్ట్యూమ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇప్పటివరకు తెరపై కనిపించిన శూర్పణఖ పాత్రలకు భిన్నంగా ఈ పాత్రను అత్యంత గ్రాండ్‌గా డిజైన్ చేసినట్లు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. పాత్రలోని గంభీరత, రాజసాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన లుక్‌కు నెటిజన్ల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సీత పాత్రలో నటిస్తున్న సాయిపల్లవితో పాటు రకుల్ ప్రీత్ సింగ్ లుక్ కూడా సినిమాపై ఆసక్తిని మరింత పెంచిందని సినీ అభిమానులు సోషల్ మీడియాలోకామెంట్లు చేస్తున్నారు. శూర్పణఖ పాత్రను కేవలం ప్రతినాయకురాలిగా కాకుండా, ఆమె వ్యక్తిత్వంలోని విభిన్న కోణాలను చూపించే ప్రయత్నం ఈ చిత్రంలో జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల సోషల్ మీడియాలో ఓ అభిమాని "ఈ పాత్రను ఎందుకు అంగీకరించారు?" అని ప్రశ్నించగా రకుల్ ఆసక్తికరంగా స్పందించారు. శూర్పణఖ పాత్రలో ఉన్న సంక్లిష్టత నన్ను ఎంతో ఆకట్టుకుంది. రామాయణంలో ఆమె గురించి చాలామందికి ఒకే ఒక్క ఘట్టమే గుర్తుంటుంది. కానీ ఆ పాత్ర వెనుక ఎన్నో భావోద్వేగాలు, తెలియని కోణాలు ఉన్నాయి. ఒక నటిగా సవాళ్లతో కూడిన పాత్రలు చేయాలని ఎప్పుడూ కోరుకుంటాను. అందుకే ఈ పాత్రను అంగీకరించాను. ప్రేక్షకులు థియేటర్‌లో కొత్త దృక్కోణంలో చూస్తారని ఆశిస్తున్నాను అని తెలిపారు.



# 'మిర్జాపూర్' నుంచి క్రేజీ ర్యాప్ సాంగ్..!

ఓటీటీలో భారీ క్రేజ్ సంపాదించుకున్న పాపులర్ ఫ్రాంచైజ్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై సంచలనం సృష్టించడానికి సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే 'మిర్జాపూర్ ది మూవీ' నుంచి మేకర్స్ ఒక క్రేజీ మాస్ ర్యాప్ సాంగ్‌ను విడుదల చేశారు. 'దో నంబరీ' పేరుతో వచ్చిన ఈ హై-వోల్టేజ్ సాంగ్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. ఈ పాటను ప్రముఖ ర్యాపర్ దండా నియోలీవాలా ఆలపించడమే కాకుండా స్వయంగా సాహిత్యాన్ని అందించి, స్వరపరిచారు. 'బందే నంబర్ 1 కే.. ధంధే దో నంబరీ' అంటూ సాగే లిరిక్స్, ఊరమాస్ బీట్స్ యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 4, 2026 న థియేటర్లలో భారీ ఎత్తున విడుదల కానుంది. మరోవైపు అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న 'మిర్జాపూర్ ది మూవీ' ఆఫీషియల్ ట్రైలర్ ఈ నెల ఆగస్టు 11న విడుదల కానుంది. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్, అమెజాన్ ఎంజీఎమ్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామాను అభినయ్ పండిట్ సినిమాటోగ్రఫీతో, మెహ్రాన్ ఎడిటింగ్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కిస్తున్నారు.



# కఠిన చర్యలు తీసుకుంటా

బాలీవుడ్‌తో పాటు దక్షిణాది సినీ పరిశ్రమలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మరోసారి వార్తల్లో నిలిచారు. డీప్‌ఫేక్ ఫొటోల కారణంగా హాట్ టాపిక్‌గా మారింది. తనకు సంబంధించిన మార్ఫింగ్ చేసిన చిత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంపై మృణాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరిస్తూ సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. ఓ ఎంటర్‌టైన్‌మెంట్ పేజ్ మృణాల్ ఠాకూర్ మార్ఫింగ్ చేసిన ఫొటోలను అభ్యంతరకర రీతిలో షేర్ చేసింది. ఏఐ సాయంతో రూపొందించిన ఈ డీప్‌ఫేక్ చిత్రాలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో మృణాల్ స్పందించక తప్పలేదు. ఈ ఫొటోలు పూర్తిగా నకిలీవని, తన అనుమతి లేకుండా రూపొందించి ప్రచారం చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన మృణాల్ ఠాకూర్.. నా పేరుతో ప్రచారం చేస్తున్న ఈ మార్ఫింగ్ ఫొటోలు పూర్తిగా అనధికారికమైనవి, చట్టవిరుద్ధమైనవి. వెంటనే వాటిని తొలగించాలి. ఇకపై ఎవరైనా ఈ చిత్రాలను షేర్ చేసినా లేదా ప్రచారం చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అధికారికంగా ఫిర్యాదు చేస్తాను అంటూ హెచ్చరించారు. సెలబ్రిటీల వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసేలా ఇలాంటి డీప్‌ఫేక్ కంటెంట్‌ను సృష్టించడం, ప్రచారం చేయడం తీవ్ర నేరమని ఆమె పేర్కొన్నారు. మృణాల్ ఠాకూర్ కూడా బహిరంగంగా స్పందించడంతో సోషల్ మీడియాలో జరుగుతున్న డిజిటల్ దుర్వినియోగంపై మరోసారి చర్చ మొదలైంది. మృణాల్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, ఆమెకు సంబంధించినట్లు ప్రచారం చేస్తున్న కొన్ని వివాదాస్పద పోస్టులు ఇప్పటికీ సోషల్ మీడియాలో కనిపిస్తుండటం గమనార్హం. ఈ ఘటనపై సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫాంస్ లేదా అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

Edited, Printed And Published Owned By K. Naresh Kumar, Flat No: 309/2, Krishna Plaza, Khairatabad, Hyderabad-50004. TELANGANA STATE, Website: www. prajamudra.Com, Email:mudranewstelugu@gmail.com, cell: 9573800809